# మర్యాదస్తునికో కథ

దక్షిణ ఇండియా తారల్లోకల్లా ప్రసిద్ధ తార కుసుమకుమారి. ఆమెను తెరమీద చూడని కళ్ళు. ఆమె పాట వినని చెవులు, ఆమె సంగీతం విని చప్పట్లు కొట్టని చేతులు, ఆమెని స్తుతించని నోళ్ళు, ఆమె దర్శనాలవేపు నడవని మనుషులకి చాలా అనవసరమని పదాలు రాశారు నవీన పోతనలు. అంతేకాదు, ఆమె పత్రికల్ని కొనని ధనం ధనం కాదనీ, ఆమెమీది కేండల్స్ చెప్పుకోని క్లబ్బులు క్లబ్బులు కావనీ, ఆమె పద్ధతిని అలంకరించుకోని స్త్రీలు స్త్రీలు కారనీ, ఆమె హృదయంలో కావలించని పురుషులు పురుషులు కారనీ, ఆమె నామ సంకీర్తనం జరగని గృహం గృహం కాదనీ, ఆమెకి సన్మానం చెయ్యని పట్టణం పట్టణం కాదనీ కూడా సీసపద్యాలు రాసి చివరికి ఆమె పైన పద్యాలు రాయని కవి కవి కాదన్నారు. ఆ అపనింద కథలపైకి కూడా వొచ్చేట్టు కనబడి భయంతో ముందే ఈ కథ రాసేస్తున్నాను అన్నాడు. ఆంధ్ర కథకుడుగా ఆచంద్రార్కం ఆమె మహిమతో ఆరాధింపబడాలని ఆశించే ఈ కథక రాజన్య చూడామణి.

కుసుమబాల గత పది సంవత్సరాల నుంచి ఆంధ్ర, తమిళ, కర్నాటక, మళయాళ, కన్నడ, హిందీ, సాంఘిక, జానపద, చరిత్ర, భక్తి, సాంస్కారిక, సాంసారిక చిత్రాలలో ప్రధాన నాయకిగా నటించింది. అన్ని భాషలలోనూ, ప్లేబాక్ లేకుండా కర్నాటక, హిందీ, బాణులలో, శాస్త్ర సినిమా, నవీన, భరతమాత, భర్తమాత, తెలుగుమాత, తమిళమాత, తన సొంత మాతల కీర్తనల్ని పాడింది.

ఆమె వివాహానికి సమస్త సినిమా కళా ప్రపంచం హాజరయింది. ఆ పెళ్ళి చాలా ఆలస్యంగా, అనవసరంగా జరిగింది. వరుడు ఎవరో చాలా కాలం నుంచి అందరికీ తెలుసు. ఆమె చిత్రాల డైరెక్టరు సంజీవరాయుడు. అతను ఆమె చిత్రాల డైరెక్టరు కావడానికి అర్హత, పదేళ్ళనించి ఆమె శయ్యా భాగస్థుడు కావడం. యోగ్యత ఆమె సినిమా కంపెనీ షేర్ల భాగస్థుడు కావడం! ఆమెకి వొచ్చిన పెళ్లి బహుమానాలతో మద్రాసు నగరంలో బట్టల షాపులూ, నగల షాపులూ పాత సరుకు తీసేసి నింపవొచ్చు.

గొప్ప డిన్నరు ముగిసేప్పటికి ఇంకా రాత్రి తొమ్మిది గంటలే సినిమాల ఆర్కెస్ట్రాలూ, పాటకులూ, హాస్యనటకులు, చేరిన తరువాత ఏమేం ప్రోగ్రాములు వుంటాయో తెల్లార్లూ అనుకున్నారు అతిథుల్ని ఒక పెద్ద హాలులో ఆసీనుల్ని చేసి సంజీవయ్య వాళ్ళని ఎడ్రసు చేశాడు.

"ఈ శుభ సమయంలో మిమ్మల్ని వినోదపరచడానికి నాకు ప్రత్యేకమైన పద్ధతి తోచింది. పాటకచేరీలు మొదలైనవి చాలా మామూలు. మనం రోజూ అవస్థపడే పాటల్ని వాళ్ళు ఇక్కడ వినిపించడం. ఈ రాత్రి మీకు ఓ కథ చెపుతాను. అది ఈనాటి వధూవరుల

ప్రణయగాథ - లేక అప్రణయబాధ - లేక జీవిత శోధ, కాకపోగ ప్రణయ మరణ బోధ" అని ఆగాడు.

సంజీవరాయుడు చాలా ప్రేమాస్పదుడు. గర్వమూ ఈర్ష్యలేని మనిషి ధర్మపరుడు. కష్టంలో వున్న సోదరుడికి వెంటనే ఆలోచన లేకుండా చెయ్యి అందిస్తాడు. కనక ఎవరికీ అతనిమీద ఈర్ష్యగాని, ద్వేషంగాని లేదు. అతను చెప్పే కథని చాలా కష్టంతో విన నిశ్చయించుకున్నారు, అక్కడ కూడినవాళ్ళు.

"నా వయస్సు? ముప్ఫై ఎనిమిది, కుసుమ వయస్సు నే నెరుగును. కాని ఇప్పుడు చెప్పానంటే సాయంత్రంలోగా విడాకుల దరఖాస్తు పడుతుంది. కనక ఆమె వయస్సు పత్రికల్లో ఆరేళ్ళనించి ప్రకటిస్తున్నా ఇరవై ఏళ్ళేనంటాను. ఆమెకి ఇప్పుడు ఇరవై ఏళ్ళే ఐతే ఆమె సినిమాల్లో తన పదో ఏటనే చేరివుండాలి, అనే ప్రశ్నని మీరందరూ మాకు వినపడకుండా తర్కించుకున్నదే గనక, నేనంతకన్న ఏమీ చెప్పనక్కర్లేదు.

ఈ వివాహం జరగడానికి వీలుని కల్పించిన అయ్యదేవర కాళేశ్వర్రావుగారికి నమస్కారంతో ఈ కథని ప్రారంభించకపోతే చాలా కృతఘ్నులమౌతాము. మార్పుడు వివాహాలు చేసుకో తలుచుక్నువారు, ముందే ఎట్లా సంసిద్ధులు కావాలో ఆయన బిల్లులో సూచించి మనకందరికీ కృతజ్ఞతాపాత్రులైనారు. అదేగాక మీరందరూ కూడా మాకు కృతజ్ఞులు కావాలి. ఎందుకంటే మాది భవిష్యత్ సూచకమైన పయనీర్ వివాహం. మీ అందరికీ ఆదర్శప్రాయం. త్వరలోనే మీరందరూ మమ్మల్ని అనుకరిస్తారనీ, ఇప్పుడు కుర్చీలలో కూచున్న జంటలు, కొంతమందైనా, ఇంకోసారి ఇట్లా ఓ శుభకార్యానికి కలుసుకునే లోపల స్థలాలు మార్చుకునే యోగ్యతని న్యాయశాస్త్రరీత్యా సంపాయించుకుంటారనీ ఆశించడం వల్ల కాబోదని విశ్వసిస్తున్నాను.

నేను చెప్పబోయే కథలో అతను "అంటే" సంజీవ రాయుడు. ఆమె - అంటే కుసుమకుమారి. ఈనాటినించి ఆమె కుసుమదేవి. ఇదివరకు కూడా శరీరరీత్యా కుమారి కాదనుకోండి. ఈనాటి నుండి చట్టరీత్యా కూడా కాదు.

ఈ కథ ఐదు భాగాలు...

## 1

ఆనాడు అతను ఓ చిత్రానికి దర్శకుడు. అంటే అదే ఉద్యోగం హోదా తనకి తానే ఇచ్చుకున్నాడు. ఆ రాత్రి షూటింగు నుంచి బైటికి వచ్చేప్పటికి, ఒకామె నుంచుని వుంది బైట రోడ్డుమీద. ఆ అపర రాత్రి స్టూడియో దగ్గిర ఒక్కత్తెగా ఆమె నుంచుని వుండడం వింతగా కనిపించింది. ఆగాడు అతను. అపర రాత్రులైనా స్టూడియోల వెలుపల, నీడల్లో చెట్లకొమ్మల మీద. దగ్గిర ఒక్కత్తెగా ఆమె. బైటికి వొచ్చే మనుషుల భుజాల మీద రంగుల పిట్టలు వాలుతో వుంటాయి. ఎప్పుడన్నా కాని ఆ పిట్టలకి కార్లున్న వాళ్ళ భుజాలూ

వొడులూ చాలా యిష్టం. ఈమె వాలకం వేరుగా వుంది. ఆగాడు. ఎందుకు ఆగాడు? ఆగకపోతే కథే లేదు. నిరంతరం ప్రతి నిమిషం యుగ యుగాల్నుంచి ఈ మాయ తెరమీద బొమ్మలనల్లే విసుగులేని కథకుడే ఆపాడు అతన్ని, కొత్త కథకోసం.

"ఎవరు?" అని అడిగాడు.

తలెత్తకుండానే "ఏం లేదు" అంది.

"ఫిల్ములో చేరాలని వొచ్చావా?"

"అవును" అని ఆమె అంటే ఏం జరిగేదో ఎందుకంటే అతని ప్రశ్న, జేబులో నాల్గు ఫిల్మ్ కంపెనీల అధికారం పెట్టుకుని అడిగినంత ధీమాగా వుంది. మరి దిక్కులేనట్టు నిలుచున్న స్త్రీ ముందు, 'తాను తప్ప దిక్కులేని భార్య ముందూ' కాకపోతే ఇంకెక్కడ చూపుతాడు తన గొప్పతనం పురుషుడు, ఈ క్రూర ప్రపంచంలో? కానీ నవీన కాలంలో స్త్రీకి పరాయి దిక్కు దొరకడం సులభమౌతోంది. అందుకనే పురుషుల్లో ఆత్మ విశ్వాసం, ధైర్యం పెరిగిపోయాయి. ఎందుకంటే పురుషుల కార్యశూరత్వానికీ, ఔన్నత్యానికీ స్త్రీల నేత్రాలలో ఆరాధనే జన్మస్థానం.

ఆ రాత్రి ఆమె కాదని తల వూయించింది.

"ఐతే, ఎందుకిక్కడ?" అని విసుక్కున్నాడు అతను. మొహం చెల్లడానికనీ ఆ రోడ్డు మీద కూడా అధికారాన్ని వహించి, అధికారం వున్న వాళ్ళకి స్థల కాల నిర్ణయం కాని, అవి ఎక్కడా లేని వాళ్ళకి హద్దేముంది?

"సూర్యనారాయణగారు వున్నారా లోపల?"

"ఏ సూర్యనారాయణ?"

"చిత్రాంగదుడి వేషం."

"ఓ! ఉన్నాడు. ఎందుకు?"

"ఏం లేదు. మావూరే."

"రమ్మని చెప్పనా?"

"వొద్దు, వొద్దు. వున్నారా అని, అంతే."

ఆమె తల తిప్పేసుకుంది.

అతనూ అక్కడే ఆగాడు.

నాలుగు నిమిషాల్లో సూర్యనారాయణ వొచ్చాడు. ఆమె నీడలోకి జరిగింది. అతను వెళ్ళాడు. ఆమె అక్కడే నుంచుని వుంది.

"ఏమిటి ఇంకా ఇక్కడే వున్నావా?"

"ఏమీ లేదు, ఏమీ లేదు" అని తడుముకుంటోంది.

"ఇంకెవరూ వుండరు ఇక్కడ, ఇంటికి వెళ్ళు."

"వెడతా, వెడతా" అంటోంది. కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి. పెదిమలు వొణికాయి. వేళ్ళతో చీరె చెరుగుని చుట్టి పెదుతో కిందికి చూస్తోంది.

"డబ్బులు లేవా బస్సుకి?"

"వున్నాయి, వున్నాయి."

"ఎవరికోసమన్నా నుంచున్నావా?"

"ఎవరికోసం నుంచుంటాను?"

ఆమె మాటలు నిజమనిపిస్తున్నాయి.

"తోవ తెలీదా?" పేట పేరు మరిచిపోయినావా?"

"రైలు స్టేషన్ దగ్గిరే."

"వెళ్ళు మరి. ఎక్కిస్తానురా, బస్సు చప్పున."

"మీరూ రండి అందాకా" అంది.

"ఎందుకు భయం?"

"భయం లేదు మీరూ రండి."

సెంట్రల్ స్టేషన్ ఎదురుగా దిగారు.

"ఇక్కడ సత్రం వుంది కదూ?"

"ఇదేగా!"

"రండి."

హొటల్లోకి తీసుకెళ్ళింది.

"భోజనం పెట్టించండి, మీరూ భోజనం చేస్తారా?"

"అర్థరాత్రి భోజనమా!"

వాళ్ళ బస్సు ఖర్చుకాక రూపాయిన్నర అతనికి ఖర్చు. ఇదే గోడ దగ్గర ఆమె పెట్టె వుంది. మూత తెరిచి రెండు రూపాయలిచ్చింది.

"ఇక్కడేనా నువ్వు వుండడం?" అన్నాడు ధైర్యంగా.

మాట్లాడలేదు.

"ఎన్నాళ్ళయింది నువ్వు ఈ వూరు వొచ్చి?"

"వారం రోజులయింది."

"ఇక్కడే వున్నావా?"

"లేదు, మావాళ్ళింట్లో వున్నాను."

"మరి..."

"భోజనానికి పోదాం."

భోజనం చేశారు.

"నేను వెళ్ళాలి యింటికి" అన్నాడు.

"వెళ్ళాలా?... నాకు కొంచెం పడుకోడానికి స్థలం చూపించమనండి. వీళ్ళని చూస్తే భయంగా వుంది. మాటకూడా సరిగా తెలీదు."

"ఈ సత్రంలో వొక్కదానివీ పడుకుంటావా? గదికి అద్దెకూడా అడుగుతారు."

"ఇస్తాను."

కానీ ఏమిటో ఆరాటం అతని మనసులో. ఈమె వొంటరిగా సత్రంలోనా?

"ఎందుకు వొచ్చేశావు మీ వాళ్ళ యింట్లోనుంచి?"

"ఏం లేదు. శ్రీరంగం పోయినాం, మా వాళ్ళూ నేనూ. ఇక్కడ బంధువుల యింట్లో దిగాం. రైలు దగ్గిర మా వాళ్ళని ఏమరిచి వొచ్చేశాను."

"ఎందుకు?"

"వాళ్ళు ఇష్టం లేదు నాకు."

"ఏం చేస్తావు ఇక్కడ?"

"ఏమీ చెయ్యను."

"బాగా డబ్బువుందా?"

"ఆ... నలభై మూడు రూపాయలు. ఇంకా ఈ గాజులు కూడా వున్నాయి."

"చూడూ. చాలా వెర్రిపని చేశావు. వుత్త పిచ్చిదానిలాగున్నావు. నిన్ను సూర్యనారాయణ ఎరుగునా?"

"ఊఁ" అని కష్టంగా.

"అతనితో చెప్పనా?"

"బాబూ, బాబూ ఆ పని చెయ్యకండి."

"ఎందుకు?"

"నన్ను చూస్తే చాలా కోపం ఆయనికి."

కష్టపడి ఆమెకో గది కుదిర్చి, ఆమెని దాంటో ప్రవేశపెట్టి బయలుదేరాడు, ఇంటికి

ఎవరేం చెయ్యగలరు, ఇట్లాంటి మనుషులను అనుకుంటూ.

"మళ్ళీ ఎప్పుడు కనపడతారు?"

"నేనా? నాకిదే పనా!"

"మరి నేనేమైపోనూ?"

ఏడ్చింది. అతని హృదయం ఇంకా సినిమాస్టార్లకల్లబొల్లి యేడుపులకీ, గ్లిసరిన్ కన్నీళ్లకీ అలవాటుపడి గడ్డకట్టలేదు.

"సరేలే. పొద్దున్నే వొస్తాను."

"పోనీ, ఇక్కడే పడుకోకూడదూ? వాళ్ళనడిగితే ఓ చాప ఇస్తారు నాకు నా పక్క మీకిస్తాను."

"నేను ఇంటికి పోవద్దూ, చాలా బావుంది. రేపు ఒస్తాను." అని విసుక్కుంటో వెళ్ళాడు.

కన్నీళ్ళతో ఒంటరిగా నుంచున్న ఆమె రూపం ఒకటే బాధించింది అతన్నా రాత్రి, అతని భార్య ముద్దు మాటల మధ్య.

మర్నాడు పొద్దున్న కొంచెం ఉత్సాహంగానే వెళ్లాడు. తన్ని పెద్దని చేసి తాను కనపడాలనుకునే స్త్రీ ఒకామె వుండడం గర్వంగా వుంది. ఓ వారం కనపడకపోయినా, ఇంట్లో బియ్యం లేకపోతేనేగాని నేను లేని కొరత తన భార్యకి తోచదు. కూచుని ఉంది గదిలో అతనికోసం చూస్తోననుకుని సంతుష్టి పడ్డాడు. అవీ ఇవీ మాటలయిం తరవాత వెళ్ళడానికి లేచాడు.

"మీ ఆఫీసుకేనా?"

"అవును, టయిమయింది. మా ఆఫీసుని స్టూడియో అంటారు."

"ఈవాళ కూడా ఆయన ఉంటారా అక్కడ?"

"ఎవరు?"

"అతనే, ఆ సూర్యనారాయణ" అంది విసుగ్గా.

"ఉంటాడు, ఎందుకు ఉండడూ?"

"ఏం చేస్తూ ఉంటారు?"

"కబుర్లు చెప్పుకుంటో."

"భలే కబుర్లు చెపుతాడు కదూ? చిన్నప్పుడు మా ఊళ్ళో..."

"ఆ కబుర్లు ఇంకోసారి వింటాను, ఇప్పుడు వెళ్ళాలి. అతనితో చెప్పనా?"

"చెపుతారా!..." అంది పరధ్యానంగా.

"అయినా, ఏమని చెప్పను? మీరెవరని?"

చప్పున

"బాబోయ్ ఏం చెప్పకండి, చాలా చెడ్డమనిషి. ఆడవాళ్ళు కూడా వుంటారు కాదూ అక్కడ."

"వుంటారు. ఒస్తావా?"

"అమ్మో. రాను, రాను. మరి అతను ఆడవాళ్ళతో చాలా చనువుగా వుంటాడా?"

"వాళ్ళు వుణ్ణిస్తే చాలా మహారాజులాగ వుంటాడు."

"ఎందుకు వుణ్ణియ్యరేం? ఎంత శృంగార పురుషుడనుకున్నారు! మా వూళ్ళో..."

"ఆ సంగతులు తరువాత, నేను వెళ్ళాలి."

"సాయంత్రం ఒస్తారా?"

"ఆ!"

"తప్పకుండా రావాలి. మీరే దిక్కు. మీరు రాకపోతే నాకీ వూళ్ళో గతిలేదు."

కళ్ళంబడి నీళ్ళు. తల తిప్పేసుకుంది.

"తప్పక వస్తాను."

"చాలా మంచివారండీ!" అని తన చేతిని పట్టుకుంది. కావలించుకొని వెళ్ళిపోయాడు. తోవలో ఆలోచించుకున్నాడు. ఇదేమిటి తనే గతి అంటుంది. అతుక్కోదు గద! ఏం చేసుకుంటాడు ఈమెని.

అవాళ సూర్యనారాయణతో స్నేహం చేసుకున్నాడు. వాళ్ళ వూరూ, అతని పూర్వ జీవితమూ సోమరిగా అడిగాడు. విశేషం ఏమీ లేదు. నాటకాలలో వేషాలు వేసేవాడు. పాడతాడు.

ఆ సాయంత్రం ఆమెని అడిగాడు.

"ఈ ఊళ్ళో కొంతకాలం ఉండదలుచుకున్నావా?"

"ఉండక ఏం చెయ్యను?"

"అంటే, మీ వాళ్ళ దగ్గరికి వెళ్ళవా?"

"మళ్ళీ ఖైదు."

"అయితే ఈ వూళ్ళో ఏం చేస్తావు?"

"ఏం చెయ్యాలి? ఏమీ చెయ్యను."

"అంటే, ఎట్లా బతుకుతావు? డబ్బో?"

"అవును, మీరే చెప్పండి."

"నేనేం చెప్పను? చదువుకోలేదు నువ్వు. ఇక వంట చెయ్యాలి."

"ఎవరింటోనో వంట చేస్తావా?"

ఊరికే అన్నాడుగాని పాపం ఈమె వంటమనిషా?

"ఎందుకు అట్లా బతకడం?" అంది మళ్ళీ.

"ఎందుకు బతకడం? మరి బతకాలిగా!"

ఆమె మాట్లాడలేదు. చప్పున ఆగిపోయినాడు. ఎంత ప్రశ్న? ఎందుకు బతకడం? తనా స్టూడియోలో పరుగులెత్తుతో, భార్య వండుతో, ఈమె వంట మనిషి పని చేస్తో! ఎందుకు బతుకుతూ ఉండడం?

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు నీ సంగతే."

"మీకేదో పెద్ద ఉద్యోగం కదా! నాకేమన్నా వీలు చూపలేరా?"

అట్లా స్త్రీ కళ్ళకేసి చూస్తో దీనంగా విశ్వాసంతో అడుగుతో ఉంటే తనదేం పెద్ద ఉద్యోగం కాదని ఎట్లా చెప్పుతాడు!

"నీకేమన్నా పాట వొచ్చా?"

"ఏం పాట?"

"ఏమన్నా పాడడం."

"ఎబ్బే! ఎందుకు?"

"సినిమాలో ఏమన్నా పని దొరుకుతుందేమోనని"

"వేషమే!"

"ఏం!"

"నాకేం చాతనవుతుంది?"

"సరేలే చూద్దాం. మళ్ళీ వొస్తా."

"మరి మీదే భారం."

అని మళ్ళీ చెయ్యి పట్టుకుంది. అతను చేతిని విదల్చుకోలేదు. ఆమె చేతిని వొదలగానే తొరతొరగా వెళ్ళిపోయినాడు. మళ్ళీ రాత్రంతా ఆమె కలవర పెట్టింది అతన్ని. సినీమా ఆడవాళ్ళని ఆరు నెలలు చూసింతరవాత, చాలా నిర్మలంగా వుంది మనసు, అట్లాంటి అమాయకురాల్ని కలుసుకొని మాట్లాడడం.

* * *

అతను పనిచేసే చిత్రంలో మిగిలిన భాగం కొల్హాపూరులో తీస్తారని తెలిసింది. ఆ చిత్రంలో తనకి ఉద్యోగం అతను స్వయంగా కుదుర్చుకున్నాడు గనక, అతనూ కొల్హాపురం వెళ్ళి తీరాలి, వెళ్ళకపోతే చిత్రం ఎట్లా పూర్తి అవుతుంది? కొల్హాపురం వెడుతున్నారని ఆ సినిమావారు ఎవరూ అతనితో చెప్పలేదు. అనవసరమనుకున్నట్టున్నారు కాని అతను తెలుసుకున్నాడు. చిత్రకారునికి బుద్ధి లేకపోతే, తనకి లేదా? నాలుగు రోజుల్లో ప్రయాణం. భార్యని ఇంటికి పంపేశాడు. భార్య సమస్య చులకనగా తీరింది గాని, మిత్రురాలికి సమస్య

కష్టమైపోయింది. తన ఇల్లు ఖాళీ అయింది గనక మిత్రురాలికి అద్దెకిచ్చాడు. తను తిరిగి వచ్చిందాకా ఉండమని, తన సామానుతో సహా

"ఎంత డబ్బుంది నీ దగ్గిర?"

"పాతిక రూపాయలూ, ఈ గాజులూ."

"సరే, పుణ్ణీ, నేను వెడుతున్నాను కదా! తరవాత ఏం చెయ్యతలుచుకున్నావు?"

ఆ రాత్రి ఆమె వంట చేసింది. బైట, చింతాద్రిపేట మురుగుకాలవల కంపుని చీల్చుకుని ఎక్కణ్ణించో వొస్తోంది నైట్ క్వీన్ పరిమళం. అతను మంచం మీద కూర్చున్నాడు. ఆమె గుమ్మాన్నానుకుని కూచుంది.

"మీరు వెళ్ళకపోతేనేం?"

వెళ్ళకపోతే ముంచుకుపోయిందేమి లేదు.

"నేను వెళ్ళకండానా? నేను లేకండా ఏం చేస్తారు వాళ్ళు అక్కడ? మరి చిత్రం పూర్తి కావొద్దా?"

ఈ నాలుగు రోజులూ ఆ అబద్ధం హెూదాలో సంతోషించాడు పాపం ఆ యువకుడు. తాను వెళ్ళాక నిజం తెలుసుకుంటుంది. తెలుసుకోని! అతనెవరో, ఆమె ఎవరో అటు తరువాత.

"నన్ను కూడా మీతో తీసుకుని వెళ్ళడానికి వీలుపడదా?"

"ఏ మాత్రం వీలుపడదు. నేనేం అనామకుణ్ణనుకున్నావా? నా ప్రతిష్ఠ పోతే నేనా బృందాన్ని అధికారంలో వుంచగలనా?"

"మీరు వెడితే నేనేం కాను ఇక్కడ?"

"ఇల్లిచ్చాను. అంతకన్నా ఏం చెయ్యను? అద్దె నువ్వే కట్టుకోవాలి."

ఆ గుడ్డి దీపం ముందు ఆ నిర్భాగ్యులిద్దరూ, ఇద్దరి జీవితాలూ అబద్ధంలోనే అల్లుకున్నారు, ఒకరివంక ఒకరు.

"నాకేదన్నా తోవ చూపలేరా?"

"అదే ఆలోచిస్తున్నాను" అని అతను దర్జాగా తన గొప్ప మాటలు నమ్మి మామగారు ప్రతినెలా వందరూపాయలు పంపడం మానిన రోజున అతని సంగతి ఎవరు ఆలోచిస్తారు?"

అమె చీకట్లో మంచం దగ్గిరిగా జరిగి అతని కాళ్ళు పట్టుకుంది.

"నేను మీ మనిషిని. నన్నేమన్నా చేసుకోండి. నేను మళ్ళీ ఇంటికి పోకుండా నాకింత కూడు కల్పించండి. మీ ఋణం ఎన్నటికీ మరిచిపోను..." అంది.

ఈ స్వతంత్ర భారతావనిలో స్వతంత్రం యాచించే ఎన్నివేల స్త్రీల కంఠాలో కలిశాయి ఆ ఆర్తనాదంలో.

తమాషా ఏమిటంటే - అన్ని అబద్ధాలు చెప్పిన, చెప్పించుకున్న ఆ స్త్రీ ఆ రాత్రి తన దిక్కులేనితనంలో అన్న ఆ మాటలో మాత్రం నిజం నిలబెట్టుకుంది.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఆ మంచం మీదే నిద్రపోయినారు. ఎందుకంటే ఆ ఇంట్లో వేరే మంచం లేదు. చాప కూడా లేదు. ఉన్న నాలుగు చీరల్లో మంచి చీరె చెరుగుని కింద పరుచుకుని చలిలో ఆమె పడుకుంటే భరించలేకపోయినాడు అతను.

మీ కళ్ళలో ఈనాడు ఆ యువతీ యువకుల మీద గొప్ప దయ సానుభూతీ కనబడుతున్నాయి ఎందుకు? అదృష్ట దేవత చివరికి వాళ్ళని ఆశీర్వదించింది గనక. ధనం, హోదాయే కాక, పెళ్ళి అనే పవిత్ర పుష్పహారం వాళ్ళ మెళ్ళో మెరిసింది గనక. కాని అట్లా నిలవలేకుండా, దేహాన్ని ఇచ్చేసుకున్న స్త్రీ ఎటువంటి దుర్గతికి దిగిందని విన్నా ఏమీ కనికరం రాదు.

ఈ సినిమా - కళ కాదు. సినీమా కాళిముందు ఎన్ని జీవితాలు, శీలాలు ఎన్ని విధాలుగా బలి ఔతున్నాయో మీ కందరికీ తెలుసు. ఆ కళేబరాన్ని తొక్కి పైకి పాకి మనం ఈ కుర్చీలని చేరుకున్న ధన్యులం గనక, మీసాలు మెలేస్తో కుచ్చెళ్ళు తోసుకొంటో హాయిగా కూచున్నాము ఇక్కడ.

తెల్లారకట్టే లేచాడు అతను. తనని తాను విసుక్కుంటో.

"ఈ పని కూడా చేశాను. ఇదో లంపటి పెట్టుకున్నానే!" అనుకుంటో.

ఈనాడు చాలా పత్రికల్లో పడ్డాయి మా ఇద్దరి చిత్రాలు, మా జీవిత కథలూ, మా దివ్య ప్రణయగాథలూ. కాని ఆ రాత్రి ఆ చీకట్లో, అలసటలో, పక్క సైడు కాలవ కంపులో అంతకన్న చేసే పనిలేక...

ఆ రాత్రి కలయికని ఏ చలమో కథ రచించాడంటే, ఏదో గొప్ప జ్యోతి వాళ్ళిద్దరి హృదయాల్లోనూ వెలిగిందనీ, దివ్య పుష్ప వర్షం కురిపించారనీ, అట్లా ప్రేమించుకున్న తరువాత వాళ్ళు సాధారణ మానవత్వాన్ని దాటిపోయినారనీ రాస్తాడు.

కాని వాళ్ళ మనసులో ఏ భేదమూ కలగలేదు - పర్యవసానాలకి కొంత భయం తప్ప.

మర్నాడు అతనికి శారదాంబ కనపడ్డది.

నాలుగు చిత్రాల్లో నటించిన అతనికి తెలిసిన ఎక్స్ట్రా. అమెతో కాజుయల్‌గా అన్నాడు తన ఇంటో వున్న ఆమెని ఎక్కడన్నా సినీమాలో ప్రవేశపెట్టమని, మూడు రాత్రులు ఆ మంచం మీద, ఆమెతో భార్య వలెనే గడిపి, వెళ్ళిపోయినాడు రైలెక్కి. అదీ మొదటి భాగం... ఇంక రెండోది.

## 2

సంవత్సరానికి తిరిగి వొచ్చాడు. అతను కొల్హాపూరునుంచి, ఆ సంవత్సరములో ఆమెని ఎప్పుడూ తలుచుకోనేలేదు. తిరిగి వొచ్చేటప్పటికి అతని ఇంటో ఎవరో కొత్తవారు కాపరమున్నారు. ఆమె ఏమయిందో ఎవరికీ తెలీదు. అతని సామాను ఆ ఇంటో ఓ మూల వుంది. అతనికి ఇల్లు దొరక్క అక్కడక్కడ, వాళ్ళ దగ్గిరా వీళ్ళ దగ్గిరా గడుపుతున్నాడు. అతను స్వయంగా ఉద్యోగం చేస్తున్న చిత్రం ఎడిటింగ్ పోయింది. అందుకని తనేదో పనిమీద ఉన్నట్టు తిరగడానికి కూడా ఎక్స్క్యూజ్ కనపళ్ళేదు. ఇంకెవరన్నా తనని ఆ చుట్టుపక్కల ఉణ్ణియ్యడానికి వొప్పుకొనే చిత్రం వాళ్ళు దొరుకుతారేమోనని భోగట్టాలు చేస్తున్నాడు. ఆమె ఏమై వుంటుంది? పాపం, తన వూరు పోయివుంటుంది. శారదాంబని కనుక్కుందామంటే, ఆమె నాటకాల జట్టులో ఆంధ్రదేశం పర్యటన చేస్తోంది.

ఆ రోజే శాంతారాం మద్రాసు వొస్తున్నాడు. మద్రాసు సినిమా ప్రపంచమంతా సెంట్రల్లో చేరుతోంది. మరి అతనంత ప్రముఖుడు స్టేషన్కి వెళ్ళకపోతే చాలా లోటుగా వుంటుంది. శాంతారాం తనకి అవమానం జరిగిందనుకోవచ్చు. వెడితే, శాంతారాం అతడ్ని చూడగానే, 'ఇదేమిటి నీ వంటివాడు ఈ మద్రాసులో? ఇక్కడ ఎంత కీర్తివంతుడివైతే మాత్రం ఏం లాభం? సర్వ భారత సినిమా కీర్తికి రావలసిన వాడివి. నాతో రా" అనవొచ్చు. అందుకని తనీ వూళ్ళో పూర్వం కొంత ప్రత్యేకత సంపాయించు కోవడానికని కుట్టించుకున్న షేర్వాని తీసి, దులిపి, ధరించాడు. తన భార్య టిష్యూచీరెని షామ్లాగా తలకి చుట్టి ఓ పూలమాల కొని స్టేషనుకి హాజరైనాడు. ఆ వేషంలో అతని మిత్రులు కూడా అతన్ని గుర్తించలేదు. శాంతారాం వచ్చాడు. పుష్పమాలా లంకృతుడైనాడు. వెళ్ళాడు కాని అతని మాల అతని చేతులలోనే వుండిపోయింది. శాంతారాంకి ముప్ఫై గజాల దూరంలోనే వుండిపోక తప్పింది కాదు అతనికి ఎంత ముందుకి తోసుకువెళ్ళినా, వొళ్ళు మండిపోయింది. ఓ మోటారు కారు అద్దంలో తన ప్రతిబింబం కనబడేటప్పటికి చాలా ఫూలిష్గా కామికల్గా తట్టింది అతని రూపం.

ఆపక్కన నుంచున్న ముష్టిపిల్ల మెళ్ళో వేశాడు ఆ మాలని, వొళ్ళుమండి, ఆ టాక్సీలో ఎవరో నవ్వారు. దానినిండా సినిమా ఆడవాళ్ళు. కారు బైలుదేరింది అతని పక్కనుంచి. దాంటో వాళ్ళు అతని పక్కకి రాగానే.

"ఏం అంత నవ్వు? విరుచుకుపడుతున్నారు. మీ బతుకులకి" అన్నాడు.

పెద్దనవ్వు "తెలుగువాడేనే" అని ఒకామె. కారు వెళ్ళిపోయింది.

అతను అవమానంతో దహించుకుపోతున్నాడు. మొదట తన వూళ్ళో ఆ షేర్వాణీని ధరించినప్పుడు అతని పినతండ్రి నేలకి ఒంగి సలాముచేసి,

"అదాబస్. ఆవ్. బిర్యానీ ఖావ్", అన్నప్పుడు కూడా అతనికి అంత కోపం రాలేదు.

అంతలో అతని వెనుక ఎవరో...

"ఏమండీ!" అన్నారు.

తిరిగి చూస్తే ఇందాకటి కారు అక్కడే ఆగి వుంది అతని వెనక. దాంటోంచి తొంగి చూస్తున్నారు.

ఆమె ఆ కారులోంచి దిగివచ్చినట్టుంది.

"ఏమిటి?"

అనేటప్పటికి గుర్తుపట్టాడు. ఆమె!

"నువ్వా?"

"మిమ్మల్నావేషంలో గుర్తుపట్టలేదు. ముందే గుర్తుపడితే నేను మిమ్మల్ని, ఆ మాలని నా మెళ్ళోనే వేసేవారేమో."

సిగ్గు, సిగ్గు చప్పున సమయోచితంగా... "ఆ పూలమాలని శాంతారాం నా కిచ్చాడు" అన్నాడు.

"అవును చూశాను. అందుకనే ఆ మాలని నేను కాంక్షించింది" అంది ఆమె.

అని,

"మీ సామాను సరిగా వుందా? ఎన్నాళ్ళయింది వొచ్చి?"

టాక్సీమీటరే పరిగెత్తుతోంది. పిలుస్తున్నారు వాళ్ళు.

"నువ్విక్కడే వున్నావా?"

అవును. పది, సింగారమొదలి వీధి, రాయపురం వస్తారా?" అంది కారు దగ్గిరకి పరిగెత్తుతో.

"తప్పక రావాలి. ఇవాళే" అని అరిచింది కారు కిటికీలోంచి.

వెళ్ళాలా లేదా? అతని అబద్ధాల సంగతి ఆమె ఎప్పుడో గ్రహించి వుంటుందని అతని తెలివికి సహితం తెలుస్తోనే వుంది.

ఉండలేక మర్నాడు సాయంత్రం వెళ్ళాడు.

ఓ గదిలో ఆమె పాడుతోంది. ఒక హార్మోనియం మీద వాయిస్తో ఒక గిరజాల జుట్టు అతను ఆమె పాటని దిద్దుతున్నాడు. అతన్ని కూచోమని, ఆమె పాడుతోంది. ఆ ఇల్లంతా గదులు గదులు. హాలు కూడా తడికలతో విభజించారు. అందరూ ఆడవాళ్ళు, బ్రాథెల్ లాగువుంది. పాట అయి, గిరజాల అతను వెళ్ళాక, హొటలు నించి ఫలహారం, టీ తెప్పించి ఇచ్చింది... అతని సంగతి కనుక్కుంది.

"ఫిల్ము ఎడిటింగులో ఉందా? అందుకనే మీకంత పని లేదన్నమాట, ఉంటారా ఈ ఊళ్ళోనే? కొత్త ఫిల్ము ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నారా?"

ఈమెకి తెలీదా? వేళాకోళం చేస్తోందా?

జవాబు ఏదో గొణిగి ఆమె వృత్తాంతం అడిగాడు. ఆ శారదాంబగారు ఆమెని కళానిలయ ఫిల్ము కంపెనీకి తీసుకువెళ్ళింది. ఆమెకి ఒక చిన్న పార్టు ఇచ్చారు. నెలకి యాభై రూపాయల జీతం. రిహార్సల్సు జరుగుతున్నాయి. ఈ లోపల ప్లే-బాక్ పాడి కొంచెం సంపాయించింది.

"నీకు పాట వచ్చునని నాకు తెలీదు."

"నాకూ తెలీదు. వాళ్ళు పాడమన్నారు. పాడాను. ఇష్టపడ్డారు."

"ఈ ఇల్లెవరిది?"

"మేం చాలామంది ఆడవాళ్ళం చేరి అద్దెకి తీసుకున్నాము."

"సంగీతం నేర్చుకుంటున్నావా?"

"ఆయన ఫిల్ముకవి. నా పాటకి మెరుగు పెడతానని వెంటపడ్డారు."

"మరి ఇంక నేను వెడతాను."

"వెళ్ళి?"

"వెళ్ళి - ఏమిటి?"

"ఇంతేనా?"

"అంటే?"

"చూడండి. మిమ్మల్ని నేను మరిచిపోయినా ననుకుంటున్నారు. మీరే నన్నిట్లా కాపాడింది. మీరెంత గొప్పవారైనా నన్ను మీరు వొదలడానికి వీల్లేదు. నన్ను మరిచి పోవడానికి వీల్లేదు."

అని అతని వేళ్ళ సందున ఆమె చేతివేళ్ళని పోనిచ్చి పట్టుకుంది. ఆమెకా అధికారం వుంది మరి!

"సరే. వస్తూ వుంటాలే... ఎప్పుడన్నా."

"అట్లా కాదు. ప్రతిరోజూ రావాలి. వొట్టెయ్యండి."

"ఎందుకు ప్రతిరోజూ?"

"అంతే! రావాలి. భయపడకండి. దేనికీ, డబ్బుకు గాని, ఇంక దేనికిగాను మనుషుల్ని బాధించే మనిషిని కాను" అని జాలిగా నవ్వింది.

ప్రతి సాయంత్రం ఏడింటికి వెళ్ళి ఓ గంట కబుర్లు చెప్పి వెళ్ళిపోయేవాడు అతను. ఓ సాయింత్రం అమె దిగులుగా కూచుంది. కారణం.

"రిహార్సల్సులో నా ఉచ్చారణా, చెప్పే పద్ధతి వొప్పుకోవటంలేదు వాళ్ళు. ఎంత నేర్పినా రాదంటారు. వాళ్ళు నేర్పినా కాదంటారు. నేర్పిన పాట అట్లా తగలబడ్డది. ఈ కవి

లేదూ, ఆయన రాసిన పాట అది. ఆ మాటలు ఎట్లా అనాలో నేర్పుతానని వొచ్చి, నాకు వొచ్చింది కాస్త పాడు చేశాడు. సంగీత దర్శకుడు. ఇదేమిటి నీ పాట ఇట్లా పాడయ్యింది? అని తిట్టాడు. నాకు కాస్త సరిగా చెప్పడానికి మీకు తీరిక వుంటుందా? చాలా అనుభవమున్న వారు మీరు. ఎంతమందిని తర్ఫీదు చేసి బాగుచేశారో!" అంది.

తనని హాస్యం చేస్తోందా? అంత చాతకాని వాడా తాను?

ఆ రోజు నుంచి ఆమె పోర్షను తీసుకుని ఆమెకి నేర్పుతున్నాడు. మద్రాసు వొచ్చినప్పుడు తాను యాక్టర్ కావాలనే ఉద్దేశ్యంతో భావ ప్రదర్శనం అలవరుచుకోటానికి ఓ పెద్ద అద్దం కొన్నాడు. దాన్ని తీసుకొచ్చి ఆమె గదిలో పెట్టి ఆమెకి భావ ప్రదర్శనం నేర్పడం ప్రారంభించాడు. తత్ఫలితంగా ఆమెని చాలా మెచ్చుకుంటున్నారని సంతోషపడుతోంది ఆమె. దాంతో అతనికి స్వవిశ్వాసం హెచ్చింది. కాని అతను డబ్బులేక ఉపవాసాలుంటున్నాడు. పైకి మాత్రం ఆమె ముందు డాబుగా ఆకలి లేనట్టే నటిస్తో తన గొప్పతనం చాటుకుంటున్నాడు.

ఫిల్ము తీస్తున్నారు. ఆనాడు ఆమె సెట్ మీదికి వెడుతోంది. ఆమెతో ఆమె సంబంధీకుడుగా అతనూ స్టూడియోకి వెళ్ళాడు. ఆమె మేకప్ దగ్గిర స్వయంగా వుండి సలహానిచ్చి ఆమెని తయారుచేయించాడు. ఆ తయారు చేసే మనిషిని తాను ఎరిగి వుండటం వల్ల మేకప్ఐన ఆమెకీ అసలామెకీ ఏమీ పోలికలేదు. లీలా చిట్నిస్ మారిన కన్నా ఎక్కువగా మారిపోయింది. ఆమె ఆమెని చూస్తే, ఇదెక్కడి అందం! అనిపించింది. మొదటి రషెస్ చూడటంతోటే డైరెక్టరు కవిని పిలిచి తక్కిన కథ మార్చి ఆమె పోర్షనికి ప్రాముఖ్యం ఇయ్యమన్నాడు. ఆమెకి నెలకి రెండు వందల యాభై రూపాయల జీతం అయింది.

ఈ లోపల అతని చిత్రం కంపెనీవారు రెండో ఫిల్ము తియ్యడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈసారి అతన్ని ఆ చుట్టు ప్రక్కల వుణ్నిస్తారో లేదో అనుమానంగా వుంది. ఎందుకంటే ప్రొడ్యూసర్ల బంధువర్గంలోని యువకులు చాలామంది పోగైనారు స్టూడియోలో.

ఓ సాయంత్రం ఆమె ప్రస్తావించింది అతనితో.

"మీరు రెండో చిత్రం తీయబోతున్నారుట. ఇంక మీకు తీరుబడి వుంటుందో లేదో?"

"ఫరవాలేదు. సాయంత్రం ఏమీ పని వుండదు. వున్న వాళ్ళకి పని చెప్పి వొచ్చేస్తాను. నా చేతికింద బాగా తర్ఫీదైనారు."

"మీ ఫిల్ములో నాకేమీ స్థలం వుండదా?"

"మరి చెప్పలేదేం? అందర్నీ బుక్ చేసేసుకున్నామే!"

"పోనీ మా ఫిల్ములో మీరు చేరండి."

"ఎందుకు? నాకేం ఖర్మం!"

ఆ మాట అనడానికి చాలా బాధపడ్డాడు. ఒకవేళ తన స్థితి తెలిసే మాట్లాడు తోందేమో ఆమె. ఆ మాటలనకపోయినా, ఓ ఫిల్ముకి తాను డైరెక్టరైనట్టే మాట్లాడుతున్నాడు అతను. మరి అంత హోదా గలవాడు. ఇంత బీదగా ఎందుకు కనబడుతున్నాడు? చాలామంది సినిమా తారలు ధనం దాచుకుని బీదగానే ఉంటున్నారు మరి.

మొదట్లో అతను ఫిల్ముల్లో సంపాదన ప్రయత్నం చేస్తానంటే మామగారు ఒప్పుకోలేదు. అతను మద్రాసు పారిపోయి వొచ్చి, తనకి యాభై రూపాయల ఉద్యోగం అయిందని బొంకి భార్యనించి నెలకి వంద రూపాయల్ని తెప్పించుకున్నాడు. ఏడాది కిందట భార్య వెళ్ళి ఏం చెప్పిందో తండ్రితో. అతను నెలకి నలభై రూపాయలే పంపుతున్నాడు. ఆదాయంతో పాటు అతని భోజనమూ, దానికి రూపమూ సన్నగిల్లాయి. బట్టలు చినిగిపోయినాయి. అదంతా ఆమె గమనిస్తోనే వుందని అతనికి తెలీదు.

"ఖర్మమేమిటిలెండి! అక్కడ మీకు పని ఎక్కువగా లేదంటున్నారు. పైగా మా ఫిల్ము డైరక్టరుకి ఏమీ తెలివిలేదు. ఊరికే తడుముకుంటాడు. మీ వంటివారు ఉండి సరైన మార్గం చూపితే కొంత బాగుపడతాడు. పైగా నాకు కనబడుతోవుంటారు. అదీ, నాకు ముఖ్యమైన విషయం.

"నేనెందుకు నీకు కనపడడం?"

ఆమె పొరపాటున మాట అనేసినట్టు వూరుకుంది?

"ఏం లేదు. కనపడితే నాకు ధైర్యంగా వుంటుంది"

"నేను ఉచితంగా ఎందుకు చేస్తాను?"

ఉచితంగా, ఫిల్ము గుంపులో ఉణ్ణిస్తేనే చాలు - ఏనాటికైనా పైకి పోకలేకపోతానా అనుకునే మనిషి తీరా ఆఫర్ తానంతట అదే వొచ్చేప్పటికీ బేరం ఆడుతున్నాడు. అదీగాక తాను ఎవరికి సహాయం చేశాడో ఆమె తనకి సహాయం చేస్తానంటోంది. భరించలేడు.

"నెలకి వంద రూపాయలు ఇయ్యరా ఏమిటి?"

వంద రూపాయలే!

"ఎందుకు ఇస్తారు? అయినా వంద నాకేం లెక్క!"

"నేను మాట్లాడి పెడతాను కాదూ! ఏదో పై ఖర్చుకి వుంటుంది."

అనుమానం భగ్గుమంది. ఈమె చెపితే ఎందుకు వింటాడు ఆ డైరెక్టరు?" అయినా తనకేం సంబంధం?

"నువ్వు మాట్లాడితే, నాకెందుకు ఉద్యోగం ఇస్తాడు?"

"మీ కీర్తి ఆయన మాత్రం వినలేదనుకున్నారా? మీతో పోటీ చెయ్యగలనా అని ఎంత భయమనుకున్నారు మా డైరక్టరికి?" అదిగాక మీరు నన్ను తర్ఫీదు చేసింతరవాత నా మీద చాలా గౌరవం కలిగింది ఆయనకి.

ఏమైతేనేం ఉద్యోగం నిజమైతే...

నిజమే అయ్యింది. వందరూపాయల ఉద్యోగం సహాయ దర్శకుడుగా దొరికింది.

## 3

ఆర్నెలయింది. తను ఇంకా వందరూపాయల ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. ఆమె మూడు చిత్రాలలో ఏక కాలమందే నటిస్తూంది. ఒక్కొక్క చిత్రంలో నెలకి వెయ్యి రూపాయల జీతం తీసుకుంది ఆమె. మేకప్ అద్భుతం. ఎటువంటి భావాలనూ అద్భుతంగా ప్రదర్శిస్తుంది. కాని అవన్నీ అతను చూసి బోధించాలి. మాటల భావం, ఉచ్ఛారణ చూపాలి. పాట ధోరణిని దిద్దాలి. ఇంటి దగ్గిర అతని ఏది నేర్పితే అది చిలకమల్లె చక్కగా, కళ్ళు చెదిరేట్టు నచ్చచెపుతున్నా వింతైన ఆమె అభ్యుదయానికి ఇంకేవో తప్పుడు కారణాలు ఉండాలని అనుమానిస్తోనే ఉన్నాడు.

మామగారు డబ్బు పంపడం మానాడు. భార్యని పంపమని అతను రాయనూ లేదు.

చాలాసార్లు ఆమె అడిగింది అతన్ని. గదిని వొదిలి తాను మంచి ఇంటోకి పోతలుచుకున్నాననీ, చూసి పెట్టమనీ వంద రూపాయల జీతంతో అతను కొంచెం హాయిగానే ఉన్నాడు. అతని అసలు ఫిల్ము ఉద్యోగం సంగతి ఆమె ఎత్తలేదు మళ్ళీ. అతను తన కొత్త ఉద్యోగంలో నటీ నటులకి రిహార్సల్సు చేయిస్తూనే వున్నాడు. కాని అతని నించి వాళ్ళకేం రాలేదు. అతనిలో ఏమాత్రం ప్రతిభ ఉన్నట్టూ ఎవరూ గుర్తించలేదు. ఏమూలో అతనికి ఆమె తన మూలాన అంత ఉచ్ఛస్థితికి వొచ్చిందికదా ఆ టీ ఫలహారం తప్ప తనని తీసుకోమని ఎప్పుడూ ఏదీ ఇచ్చింది కాదే అని బాధగానే వుంది. సినీమాలలో తనకంతకన్న గతులు లేవని అతనికి అర్థమయింది. తన ఊళ్ళోనే ఆ మాత్రం ఉద్యోగం ఏక్కడైనా చేసుకోవచ్చే! మామగారి ఇంటో హాయిగా ఉచితంగా తింటో బతకవచ్చే! ఆ ఉద్యోగంరాక, ఈమెకి పాఠాలు, ఎందుకొచ్చిన చాకిరీ ఇదంతా, అని చాలాసార్లు అప్పుడప్పుడు యోచించాడు. కానీ సినిమాలో ఏదో ఉత్సాహం, రంగుల మాయా ఉన్నాయి. ఆ సంగతి అతనికి తెలీదు. అట్లానే వుండిపోయినాడు మొత్తానికి.

ఇంతలో ఆమెకి ఇల్లు దొరికింది. మాంబళంలో చిన్న బంగళా.

"ఎల్లుండి వెళ్ళిపోదాం" అంది.

"ఎవరు?"

"మీరూ నేనూ."

"నేనా? నేనెందు?"

ఆమె మాట్లాడలేదు. మొహం తిప్పేసుకుంది. ఆ చీకటి గదిలో చీకట్లోకి మళ్ళీ తనవేపు తిరిగేలోపున కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"నే నెందుకు? అని అడిగితే, జవాబు ఏమీ లేదనుకోండి. ఆ ప్రశ్న మీలో వొస్తుందనుకోలేదు నేను."

"మరి నాకేం అర్థం కనపట్టంలేదు."

"నన్ను పట్టుకుని అన్నీ నేర్పడంలో ఏమన్నా అర్థం కనపడ్డదా మీకు ఇన్నాళ్ళూ?"

"ఆలోచించలేదు."

"నేను పాపాత్మురాలిని కాదు. మీనించి నాకు భేదభావం లేదు. కనకనే అంత చనువు తీసుకున్నాను. మగవారు సులభంగా మరిచిపోతారు. స్త్రీ మరువలేదు. అందువల్లనే అన్నీ కష్టాలు స్త్రీకి. అందువల్లనే లోకంలో కాపరాలనేవి నిలిచి ఉన్నాయి.

"చలం చింత కూడదంటున్నా" అని నవ్వాడు అతను.

ఆ ముందు రోజే వాళ్ళు అరుణ చదువుకున్నారు.

వారం రోజులైనా ఆమె ఆ ప్రస్తావన మళ్ళీ తీసుకుని రాలేదు. ఆ గది మారనూ లేదు.

ఆ మూడు రాత్రుల సంగతి గావును ఆమె మాట్లాడింది. తనమీద ప్రేమా ఆమెకి? కాని అతనికి అలాంటి బుద్ధి పుట్టలేదు. అభ్యంతరమూ లేదు. ఏదో ఎత్తు వేస్తోంది. తను ఆమెనించి వెళ్ళిపోకుండా శాశ్వతంగా అతని 'కోచ్' చేసేందుకు ఎత్తు. కాకపోతే ఆమెకి ఇంత ఉచ్ఛదశ - ఆమె ప్రతిభవల్లనైనా సినిమాలో పైకి వెళ్ళాలంటే, పడకగది సహాయం లేకుండా పని కానేకాదు. ఇంత తన మీద ఇష్టమని దొంగ కన్నీళ్ళు పెట్టుకుంటే తాను మోసపోతాడా? ఆమెతో ఆ యింటో ఉంటే, ఆమె పోషణ కింద తనకేం గౌరవం?

"ఏమయింది? కొత్త ఇంటి సంగతి?"

అన్నాడు బీచి ముందు ఆమెతో.

"ఎవరికో ఇచ్చేశారు."

"అదేమిటి?"

"మీరు లేంది. నా కొక్కత్తెకూ ఆ ఇల్లెందుకు?"

"సరిగా చెప్పు. నన్నెందుకు రమ్మంటున్నావు?"

"ఎందుకు రానంటున్నారు? మీకు వొచ్చి నాతోకలిసి ఉండడానికి నా మనసులో కారణం వెతుక్కోనక్కర్లేదు. రాకుండా ఉండడానికి మీరు వెతుక్కోవాలి కారణాలు - అవును మరి! మీకు ఇల్లుందా వేరే."

"ఏం? నా భార్య రాకూడదా?"

"వొచ్చినా మనతో ఉండదా అమె? సరేలెండి. ఆమె వొచ్చాక కద. అయితే రప్పించండి. ఆమెతో మాట్లాడి సరిపుచ్చుకోగలను నేను."

"అవునులే నీతో మేమెక్కడ తూగగలం!"

"తూగడమేముందీ. అంతా మీదే."

"మాదా?"

"ఎందుకు ఆ అబద్ధం? మీలో మీకు తెలీదా, నేనేం సంపాదించినా, అంతా మీరు పెట్టిన భిక్ష అని! ఎప్పుడో చేసి వొదిలిన సహాయం కాదు. ప్రతిదినమూ మీ తిండి తింటున్నాను."

"అది మీ మంచితనం. నేనేం అట్లా అనుకోటం లేదు."

"సరే పోనీండి. నేనిట్లా గొందిలోనే చీకట్లో కుళ్ళిపోతాను సంతోషించండి" అని అక్కణ్ణించి లేచిపోయింది.

ఇంకో రోజు అతను వెళ్ళి కూచోగానే మాట్లాడకుండా అతనికేసి చూస్తూ కూచుంది.

"ఏమిటి సంగతి?"

"రాత్రి సినిమా చూడ్డానికని వెళ్ళాను."

"వెడితే అట్లా చూడ్డమెందుకు?"

"దాంటో మీవంటివాడే ఉన్నాడు."

"ఏం చిత్రం?"

"జిందగీ"

"చివరికేమయింది?"

"ఏమయింది? ఇద్దరి జీవితాలు దగ్ధమైనాయి."

"మనవీ అట్లానే ఔతాయంటావా?"

"కావు."

"ఎందుకు?"

"నేను శ్రీమతిని కాను గనుక."

"కాక..."

ఆమెకి చాలా బిడియం, అలివికాని ఆత్మగౌరవం - కాదు గర్వం."

"నీకు?"

"నేను సిగ్గులేని దాన్ని."

"ఏమీ కాదు."

"మీ ముందు."

అని మళ్ళీ-

"పాపం ఎన్ని కలలు కంటుంది!"

"నువ్వా?"

"నేనూనూ అక్కడే పోలిక."

"ఏం కలలు?"

"ఆమెవి ఏమైతేనేం? నావి మీకు తెలుసు."

"చక్కని బంగళా."

"ఊ"

"కారు."

"ఊ"

"బంగళా ముందు తోట, లోపల చక్కని ఫర్నిచర్."

"ఊ."

"అంతేనా?"

"కాదు."

"జాతి కుక్కలు, నౌకర్లు."

"ఊ"

"అంతేనా?"

"అంతేలెండి. చాలు."

అని పాట పాడుకుంటోంది.

ఏమిటి ఈమె తన భార్యమల్లే కాపరం పెట్టాలనుకుంటుంది కావును. ఒకే ఎత్తువేసింది. ఇంక తనకేం పని? ఆమె వెంట సామాన్లు పట్టుకుని చీరెలు, బ్యాగ్, కుక్కా... అమె లోపలికి వెడుతూ తనని కొన్ని గదుల గుమ్మాలముందే ఆగమని.

అని ఆలోచించుకుంటున్నాడు.

"ఆలోచించుకోండి. ఇంకా ఊహించుకోంది, మీ చిత్తమైనన్ని అబ్బా, మనుషుల అభిమానాలూ, అనుమానాలూ!"

అని విసుక్కుని మళ్ళీ పాడుకుంటోంది.

ఇలా వాళ్ళ మధ్యనున్న సుహృద్భావం చెడింది. అతను వెళ్ళడం తగ్గిస్తున్నాడు. ఆమె కూడా నిరాశతోనూ ఉపేక్షతోనూ ఊరుకుంది. అదిగాక ఆమెకు చాలా పని. ఆమె మొదటి చిత్రం గొప్ప విజయవంతం అయింది. ఇంకా కొత్త ఆఫర్స్ వొచ్చె సూచనలు గాలిలో ఎగురుతున్నాయి.

ఇంతలో ఆ చిత్రం మద్రాసులో విడుదలయింది. ఇది వరకు పత్రికల నిండా ఆమె పటాలు. ఇప్పుడు ఆమె మద్రాసు వీధుల గోడలు పక్కకెక్కింది. ఒకటే సిగ్గు ఆమెకి.

"మనం వెళ్ళి చూడవొద్దూ?" అని అడిగింది సందేహంగానే.

"కానీ."

"మనిద్దరికీ పాస్ తీసుకొస్తే వొప్పుకోరా మీరు."

వొప్పుకోకుండా వుంటేనే ఘనతగా వుంటుందనిపించింది. అప్పటికప్పుడే అతనికి.

మొదటి నుంచీ ఆమె అదృష్టం తన చేతుల మీదుగా నడిచిందనీ, ఆమె జీవితం తనని పెనవేసుకుందనీ, స్థిరత్వంలో కాలం గడపకుండా వుంటే అంత ఆత్మగౌరవంలో నిలిచేవాడా అతను? అదిగాక ఆమె సామాన్యురాలు కాదు ఇప్పుడు. అనేక వేలమంది సినిమా ప్రేక్షకుల కలలకి ఆధారపుపట్టు.

అట్లా కాదు. మనం గూఢంగా వెడదాము. టిక్కెట్లు కొనుక్కుని టాక్సీలో పోదాం, సినిమా అయిం తరువాత బసోటాలో భోజనం ఏం?" అంది.

బసోటా! బసోటా భోజనాల సంగతి ఈమెకేం తెలుసు?

"బసోటా ఏమిటి?"

"బసోటా హెూటల్ మీకు తెలియనట్టే!"

"నీకెట్లా తెలుసు?"

"మా డైరెక్టర్లు అనుకుంటూ వుంటారు. అక్కడ వాళ్ళ జీవితాలు తరిస్తున్నట్లు."

"మన జీవితాల్ని కూడా అక్కడే తరింపచేస్తేకాని ముక్తి లేదంటావా?"

"అంతకన్న ఏం లేక, పోనీ ఇంకో స్థలం చెప్పండి మీకిష్టమయింది."

"సరేలే నీ ఇష్టం."

ఇంతచేసి హాలు దగ్గిరికి వెడితే వారం రోజులు దాకా స్థలం దొరకదన్నారు. టాక్సీ కోసం చూస్తుండగా ఎవరో గుర్తుపట్టారు ఆమెని. "కుసుమబాల" అని అరిచారు. గుంపు పోగయింది. రోడ్డు బందు. ఆ సినిమాహాలు వారు గుర్తించారు ఆమెని.

"మీరా?" అని లోపలికి తీసుకుపోయినారు.

అతను మిగిలిపోయినాడు. అందరిముందూ సిగ్గయి చప్పున గుంపులో కలిశాడు.

ఇంతే కదా! తనని వొదిలి వెళ్ళిపోయింది అనామకుడు గనక తను. తానెవరు ఆమెకి - కాకపోతే?

ఇంతలో భుజంమీద చెయ్యి, "పిలుస్తున్నారు మిమ్మల్ని" అని. వాళ్ళిద్దరికీ ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశారు సినిమావాళ్ళు. దాంతో మరింత కోపం అతనికి. తనని పిలవనంపకపోతేనేం? ఇంక తన పేరు కలుపుతారు ఆమె పేరులో?

ఫిల్మ్ ప్రారంభమయింది. ఇన్‌టర్‌వల్ దాకా అతనికి వొళ్ళు తెలీలేదు. అంత ఐక్యమైపోయినాడు తెరతో. మధ్యలో దీపాలు వెలిగినప్పుడు తన చెయ్యి ఆమె చేతిలో సహజంగా వుంది.

"ఏమిటి! ఏమిటి! అది నువ్వే? నువ్వు? నువ్వు.... నీకు పోలికకి కూడా ఎవరూ లేరు. నువ్వు అవతారం అన్నాడు. అతనొక్కడే కాదు. ఆ ప్రేక్షకులందరిలో మాటనే అతనూ అన్నాడు. ఇంక ఖ్యాతి గడించినా ఆమె ఆ ఖ్యాతి అంతా తెరమీద కుసుమ బాలకి. ఆమెది కాదు. ఆమెని ఎరిగినవాళ్ళు స్టూడియోవాళ్ళు మాత్రమే. ఆమెది ఇంతవరకూ చాలా గుప్త జీవితం. పైగా రంగులేని కుసుమని గుర్తించడం కష్టం.

మిగిలిన చిత్రాన్ని మెళుకువతో చూశాడు. అక్కడ ఆ అద్భుత లావణ్యవతి తన పక్కన కూచున్న స్త్రీ అతని మనసు ఆ రెండు రూపాల్నీ ఓ క్షణం కలుపుతుంది. ఓ క్షణం విడతీసుకుంది. కాని అతని చెయ్యి గట్టిగా ఆమె వేళ్ళ మధ్య వుండిపోయింది.

హాలు వాళ్ళ కారులో ఇంటికి వెడుతున్నారు. అతని కళ్ళముందునించి ఆమె మెరుపు పోలేదు. లోకంలో మామూలు మర్యాదగల స్త్రీ అయివుంటే, ఆమె ఆమె పాదాలమీద కళారాధనతో అతను వుందునేమో! కానీ అతను కారులో నడుం మీద చెయ్యేసి దగ్గిరగా తీసుకున్నాడు. హొటల్లో భోజనం చేస్తో కూడా. ఆమెనించి కళ్ళు తీసెయ్యలేదు అతను.

"ఎవరు నువ్వు!"

"మీరు నేర్పిందే."

"నేనా? నేనా?"

ఆ రాత్రి అతను ఆ చీకటిగదిలో ఆమె మంచం మీదనే నిద్రపో... లేదు. ఆమె కళ్ళవంక వెన్నెలలో చూస్తో.

వారంరోజుల్లో గోపాలపురంలో ఓ పెద్ద బంగళా తీసుకున్నారు వాళ్ళిద్దరూ. కారు కొన్నారు. నౌకర్లని పెట్టారు. కొత్త చీరెలు, షోకులు, సూట్లు, వేషాలు పదిరోజుల మార్పుతో వాళ్ళని గుర్తించడం కష్టం.

## 4

కొన్నాళ్ళు వాళ్ళిద్దరూ చాలా సుఖంగా గడిపారు. ఆమె మీద అతనికేమీ ప్రేమ లేదు. కాని ఆ తెరమీద చూసిన ఆ రాజకుమారి మీద అతనికి చెప్పరాని ప్రేమ, తలుచుకున్నంత మాత్రాన అతని వొళ్ళు పరవశమయ్యేది. తిరిగి తిరిగి ప్రయత్నించి ఆ రెండు రూపాలకీ సంబంధం కలుపుకున్నాడు. ఆమె అతన్ని ఇంటికి యజమానిని చేసింది. నౌకర్లు, డబ్బు, ఆజ్ఞలూ అన్నీ అతని నించే. అతని మనసులో అతనిమీద అతనికి గొప్ప గౌరవం ఏర్పడ్డది. ఆకస్మికమైన అతని అదృష్టాన్ని చూసి అతనికే ఆశ్చర్యం! ఆర్నెల్లూ నిమిషాలమల్లే గడిచిపోయినాయి. ఆమె ఆదాయం అమితంగా పెరిగిపోతోంది.

ఆమెకి వ్యవధి తక్కువవుతోంది. ఇంట్లో వున్న కాలంలో ఆమెని కొత్త పార్టుకి తర్ఫీదు చెయ్యడంతో సరిపోతుంది అతనికి. వ్యవధి చాలక అతను ఉద్యోగం మానేస్తానన్నాడు. ఆమె ఏమాత్రం ఒప్పుకోలేదు. వొప్పుకోకపోవడం వింతగానే అనిపించింది.

అతని చిత్రంలో ప్రధాన తారకి స్టూడియో మీద నిష్కారణంగా కోపం వచ్చినందున ఆ రాత్రికి షూటింగు అయిపోయింది. కుసుమ ఇంట్లోనే వుంటుంది ఆ వేళ. అందుకని తొందర తొందరగా ఇంటికి వొచ్చాడు ఆమె కారులో. డ్రాయింగు గదిలో రేడియో పక్కన కూచుని వుంది ఆమె. ఆమె కుర్చీని ఆనుకుని ఒక అతను మాట్లాడుతున్నాడు. ఇంకా దీపాలు వెలిగించలేదు. చీకటి చీకటిగా వుంది గది. ఎవరూ కబురు పంపించకుండా లోపలికి రాగానే కోపంగా...

"ఎవరు! ఏం చేస్తున్నావు నాగప్పన్?" అంది నౌకర్ని.

"నేనే" అన్నాడు అతను ఆశ్చర్యపడుతో.

కుర్చీ పక్కగా నుంచున్న మనిషి దూరంగా జరిగాడు. అతను లైటు వేసి ఎదురు కుర్చీలో కూచున్నాడు. కొత్తగా వచ్చిన అతను వుత్త బిచ్చగాడిమల్లె వున్నాడు. అతని వంక అయిష్టంగా చూసి మాట్లాడకుంటా వెళ్ళిపోయినాడు. ఆమె మేడ పైకి రాగానే.

"ఎవరది?" అని అడిగాడు.

"బిచ్చం"

ఆమె అబద్ధం చెప్పిందని తెలిసింది అతనికి. కాని అంతకన్న తరచవలసిన విధం తెలీక -

"ఎందుకు రానిస్తావు అట్లాంటివాళ్ళని?" అని తన గదిలోకి వెళ్ళిపోయినాడు.

అతని మనసు స్థిమితం లేదు. ఆ మనిషిని తానెక్కడో చూశాననిపిస్తోంది అతనికి. అతను ఇదివరకో రెండు మూడుసార్లు వొచ్చినట్టూ, మళ్ళీ ఒకసారి వొచ్చినట్టూ నౌకర్లు మాటల ధోరణిలో అన్నారు. అంతేగాక ఆమె బాంకు బుక్కులో ఆమె అప్పుడప్పుడు వందా, రెండువందలూ తీస్తున్నట్లు చూశాడు. ఇదివరకు అతనితో చెప్పకుండా డబ్బు తియ్యడం ఎప్పుడూ జరగలేదు.

ఆమెనడిగితే, ఏదో ఖర్చులు వొచ్చాయి. జ్ఞాపకం లేదు అనేసింది విసుగ్గా.

ఒకరోజు అతను, ఆమె కారుదిగి హాలు లోపలికి వొచ్చేప్పటికి, ఆనాడు వొచ్చిన మనిషి, ఇంకో అతనూ అప్పటికే కూచుని సిగరెట్లు కాలుస్తో మాట్లాడుకుంటున్నారు. ఆ మనిషి ఇప్పుడు శుభ్రమైనాడు. అతను సూర్యనారాయణ. పలకరించకుండా ఎట్లా వుంటాడు అతను.

"ఏమిటి? మీరా? ఆ సాయంత్రం మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయినాను" అన్నాడు.

"అవును బళ్ళు ఓడలవుతాయి. ఓడలు బళ్ళవుతాయి" అన్నాడు అతను. వెనక్కి కూచుని సిగరెట్ పీలుస్తో. వాళ్ళని చూసి ఆ వొచ్చిన వాళ్ళు అట్లానే కాలన్నా కదల్చకుండా హాయిగా పొగరుమోతుగా కూచున్నారు. కొంతసేపు మాటల్లేవు. కాలే సిగరెట్టు ముక్కని తివాసీ మీద పారేసి, సూర్యనారాయణ-

"కుసుమా, నీతో వొంటరిగా మాట్లాడాలి" అన్నాడు.

"టీ తీసుకొస్తారు" అంది ఆమె.

"నాకెట్లాను పని వుంది. వెడతాను. టీ నాకు పైకి పంపించు" అని లేచాడు అతను.

ముందు ఆమెని 'కుసుమ' అనగానే అతనికి కళ్ళు తిరిగాయి. ఇప్పుడు సరిగా నుంచోలేక పోయాడు.

ఆమె చప్పున లేచి అతన్ని ఆపి, సూర్యనారాయణతో

"మాట్లాడేది ఇక్కడే మాట్లాడండి. రహస్యానికేముంది" అంది మొహం ఎఱ్ఱనౌతో-

"అట్లా అయితే సరే. నేను మొన్న స్టూడియోలో చెప్పలా రాజమాణిక్యంగారు ఈయనే."

రాజమాణిక్యంగారు ఒక సినిమా కంపెనీ ఫ్లోట్ చేస్తున్నారు. దాని వివరాలు అడుగుతోంది. కుసుమ తెలుసుకున్న తరువాత.

"మీరు ఏమంటారు?" అంది అతనివేపు తిరిగి.

"ఏ విషయం?"

"ఆయన చెప్పిన వివరాల విషయం."

"కానీ చెయ్యనీ, చూద్దాం. ప్రస్తుతం ఆయన మాటలేగా ఆధారం?"

"నా మాటలు అబద్ధమంటారా? కావలసిస్తే ఎల్లంగోరు రాజుగారిని-"

"అబద్ధమూ అనలేదు. నిజమూ అనలేదు. నాకు తెలియదంటున్నాను" అని -

"ఐనా నీకెందుకు ఈ వివరాలన్నీ?" అని ఆమెనడిగాడు.

"దాంటో పదివేలు షేర్లు కొంటే, సూర్యనారాయణగారికి హీరో పాత్ర ఇస్తారట్ట."

"సరే, ఆయనకి నమ్మకమైతే ఆ షేర్లు కొని, ఆ హీరో పాత్రని వెయ్యమను."

"ఆయనకి డబ్బేదీ? నన్ను సహాయం చెయ్యమంటున్నాడు."

"అట్లాగా!"

"మీరేమంటారు?"

"పదివేలు ధర్మం చెయ్యాలని వుంటే, చెయ్యి."

"ధర్మం కింద కాదు. పెట్టుబడి కింద."

"పెట్టుబడి కింద ఏమీ లాభం లేదు."

"మీ కారణాలు?" అన్నాడు కోపంగా రాజమాణిక్యం.

"మీతో కాదు నేను మాట్లాడింది."

"నే నడుగుతున్నాను మిమ్మల్ని."

"కారణాలు చెప్పనవసరం లేదు."

"అయినా ఒక్క కారణం చెబుదురూ?"

"మీ మాటలు వింటే చాలు. మీ వంక చూస్తే చాలు, వేరే కారణం అక్కర్లేదు."

"ఆ" అని లేచాడు మీదికి వొచ్చేట్టు రాజమాణిక్యం.

"కూచోండి కూచోండి" అంది ఆమె.

టీ వొచ్చింది. తాగకుండానే లేచి వెళ్ళిపోయినాడు.

అతను పెద్ద ఆలోచనలో పడ్డాడు.

ఆమె అపాయంలోకి నడుస్తోంది. తనకి తెలియకుండానే వీళ్ళకి తనమీద చనువు నిచ్చుకుంది. తనేం చెయ్యాలి? ఆమె తనకు అంత అధికారం ఇస్తేనా? అంత వరకు తనేం అధికారం తీసుకోలేదు. అవసరం రాలేదు. ఇప్పుడు తాను కల్పించుకుని ఆమె అదిలించి మేల్కొలపాలా? కాని ఆమెని ఒత్తిడి చేస్తే ఎంత వరకు ఆమె సహిస్తుందో! అనుమానం అతనికి. తనకెందుకని తప్పుకుంటే? కాని నిస్సహాయంగా ఆమెని వొదలడం అన్యాయం. అదిగాక ఆమె తన స్త్రీ! తనని అన్నిటికీ నమ్మిన స్త్రీ.

అరగంటకి ఆమె పైకి వొచ్చి అతని పక్కలో ముద్దుగా కూచుని అసహజంగా నవ్వు తెచ్చుకుంటో-

"మరీ పెంకివారౌతున్నారేం? అంత కోపమా? వాళ్ళేం చేశారు?"

"ఛీ వెధవలు. వాళ్ళని భరించలేను. ఐనా నీకేం పని వాళ్ళతో?"

"అదేమిటి? ఏదో కష్టంలో వుండి సహాయం కోసం వొస్తే ఇంతలో ఏం మునిగిపోయింది? నేను కనుక్కున్నానుగా, ఆ రాజమాణిక్యం నమ్మకస్తుడే. నాకు కూడా చాలా నమ్మకం కుదిరింది. ఆ మాత్రం పరులకి సహాయం చెయ్యకుండా ఎట్లా బతకగలం?"

"చెయ్యి, నేను వొద్దన్నానా?"

"వొద్దనకపోతేనేం? చాలా అయిష్టంగా వున్నారు."

"వుండను మరి! సరదాకోసం బాంకునోట్లతో వంట చేస్తానంటే ఇష్టం చూపుతానా మరి?"

"పోనీ లెండి. ఏదో నా సరదాకి ఆ డబ్బు ఇవ్వనీండి. ఇంక మనసులో ఏమీ వుంచుకోకండి."

"సరే కానీ, ఆ డబ్బుతో వాళ్ళ ముఖారవిందాలు నాకు కనబడటం మానుకుంటాయా?"

"ఆ, చెపుతాను."

"అంతేకాదు. నువ్వూ వొదుల్చుకోవాలి."

"వాళ్ళు వస్తే నేనేం చెయ్యను?"

"నాకు వొదులు."

"మరి వాళ్ళకి కోపం తెప్పించడం నాకిష్టంలేదు."

"నాకు కోపం తెప్పించడం?"

"ఏమిటామాటలు. మీకూ వాళ్ళకీ సాపత్యమేమిటి?"

"ఏముందీ? ధనం కలవాళ్ళకీ, లేనివాళ్ళకీ వుండే సంబంధం."

"లక్షలున్నారు డబ్బులేనివాళ్ళు కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు."

"వాళ్ళకిచ్చేది వాళ్ళకి ఇస్తానే వున్నాంగా, ఇంక మాట్లాడకండి" అని ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

ఆమె బాంకి బుక్కులో పదివేలు తరుగు.

పదిరోజులయిందో లేదో మళ్ళీ హాజరు సూర్యనారాయణ. ఈసారి మంచి విలువగల సర్జి సూటులో, నోట్లో చుట్ట. వొచ్చి చాలా పాతమిత్రుడిమల్లే వాళ్ళిద్దరితోనూ కబుర్లు చెపుతున్నాడు. తను వెళ్ళాక, ఏమిటి మళ్ళీ వచ్చాడంటే...

"ఏమిటి మరీ అంత క్రూరంగా మాట్టాడతారు? పాపం ఏదో కొంచెం పెద్దమనిషితో కలిసి బాగుపడదామనే మనిషికి అంత మాత్రం సహాయం చెయ్యకపోతే ఎట్లా? ఎందుకంత కోపం అతని మీద? ఏం నీచుడా? అల్లరి చేశాడా? మరీ ఎవరినీ చూడకుండా, స్నేహం చెయ్యకుండా మనం వొంటరిగా బతకాలనా మీ ఇష్టం?" అని ఉపన్యాసం ప్రారంభించింది.

రెండురోజులకో మాటు రోజు విడిచి రోజు సూర్యనారాయణ వస్తూనే వున్నాడు. ముందు వాళ్ళని డిన్నరుకి పిలిచారు బసోటాలో. తాను విస్కీ తాగి, అతన్ని కూడా తాగమని బలవంతం చేశాడు. తాగనంటే హాస్యం చేశాడు. తరువాత వాళ్ళింటోనే అప్పుడప్పుడూ భోజనం చేస్తున్నాడు. వీళ్ళిద్దరూ బైలుదేరితే అతను మూడో వాడౌతున్నాడు. క్రమంగా అతని తాగుడు హెచ్చుతోందని తెలుస్తోంది. కానీ, ఏ మాత్రమూ ఇతరులకు ఇబ్బంది కల్గజెయ్యడు. జాగర్తగా మసులుతాడు.

ఆ సూర్యనారాయణ కంపెనీని ఆమె ఎన్‌జాయ్ చేస్తోంది. తనకెందుకు అతనంటే

పడదు? అని ప్రశ్నించుకున్నాడు అతను. ఆమె మీద ఏదో కొంత స్వతంత్రమున్నట్టు అతను ప్రవర్తిస్తుండడం వల్లనేమో! తనకు తెలీని వ్యవహారం ఏదో వుంది.

నెలరోజుల్లో వాళ్ళ ఇల్లు మామూలు నివాసమయింది సూర్యనారాయణకి. అతనికి ఏమి చెయ్యాలో తెలీలేదు. వాళ్ళు మేడమీద చేసే రిహార్సల్స్‌లో కూడా జోక్యం కలుగచేసుకుంటున్నాడు సూర్యనారాయణ. ఆమె నటించిన చిత్రాలలో లోపాలు చూపి, తన సలహా కింద అవన్నీ సరిదిద్దుతానని చెప్పాడు.

ఓ రాత్రి అతను ఆమెతో పెద్ద తగాదా ప్రారంభించాడు.

"మీకంత ఇష్టం లేకపోవడానికి కారణం కనపడదు. పోనీ మీకిష్టం లేదు. గనుక ఆయన్ని పొమ్మందామంటే, ఎట్లా పొమ్మనాలో తెలీటంలేదు నాకు."

"మాట్లాడకు నువ్వు అతనితో."

"ఎట్లా, పలకరించే మనిషితో మాట్లాడకపోవడం?"

"నేను పొమ్మంటాను."

"అదేగా, వొద్దనేది నేను."

"సరేలే, అతనిట్లా వొస్తూవుంటే, నేనిక్కడ వుండడం కష్టమౌతుంది."

దాంతో ఆమె ఏడ్చింది.

"నేను నీ భార్యని కాదు గనకనే కదా, అంత సులభంగా ఉండను పోతాను, అనగలిగావు?" అని.

"నా భార్యలే ఐతే ఇంత వాదన ఎందుకు? నిన్ను వాడి ముందే రెండు తన్ని వాణ్ణి అవతలకి నడవమందును."

"అంతేగా మొగవాళ్ళకి చాతనైన పని. తన్నండి పోనీ, మీకంత సరదా ఐతే."

"తన్నను. అంతకన్న మంచిపని నిన్ను పెళ్లిచేసుకుంటాను."

"నన్నా మీకు భార్య వుందిగా."

"ఉంటేనేం?"

"నేనంత పాతకానికి వొడికట్టుకోను. పాపం ఆమె ఏం చేసిందని, నేను ఆమెకి ద్రోహం చేయడం?"

ఆడవాళ్ళతో ఏ మొగవాడు వాదించగలడు? అందుకనే తంతాడు.

"ఇప్పుడు నువ్వు చేసేదేమిటి?"

"నే నేం చేశాను? మీ భార్యని రావడానికి వీల్లేదన్నానా? రేపు పిలిపించండి."

"ఈ పరిస్థితుల్లో ఎందుకు ఉంటుంది.?"

"దానికి నేనేం చెయ్యను."

"నే నేమన్నా ఆమె రావాలని అన్నానా?"

అంతటితో విసుగెత్తి ఎక్కడ అసలు ప్రారంభించారో అక్కడ విడిచి వూరుకున్నారు.

వాళ్ళకి సూర్యనారాయణ పర్మనెంటూ మిత్రుడైనాడని నిశ్చయమయింది. అదిగాక ప్రతిరోజూ అతను ఎక్కువ స్థలం ఆక్రమించుకుంటున్నాడు. ఏం చెయ్యాలి తను? అతను అసలు రాకూడదని పట్టుపట్టాలి. పడితే ఎటు మొగ్గుతుందో ముల్లు! ఎటు మొగ్గనీ ప్రస్తుత స్థితి మాత్రం దుర్భరమనిపించింది అతనికి. భవిష్యత్తు కూడా తన ఉద్వాసనకే మొగ్గు చూపుతోంది. కానీ తొందరపడకూడదని సుమతీ శతకం పద్యం చదువుకున్నాడు ఓసారి కాని...

కదలని వాళ్ళని కాలమే కదిలిస్తుంది.

ప్రతి వ్యవహారంలోనూ అతను ఏం చెప్పినా సూర్యనారాయణ గారు ఇట్లా అంటున్నారు అని అంటుంది ఆమె. సూర్యనారాయణ సలహా ఎప్పుడూ తన సలహాకి సరిగా వ్యతిరేకం. చివరికి తాను చెప్పిన మార్గాన్నే వెడుతుంది ఆమె. కాని అది తన ఘనత వల్ల కాక సూర్యనారాయణ సలహా అనర్థదాయకమని ఆమెకి తెలీడంవల్లనేమో ననిపించింది అతనికి.

ఆ చివరి రాత్రి డ్రాయింగు రూములో ఆమే, సూర్యనారాయణ చాలా ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుని నవ్వుకుంటున్నారు. అరగంటనించి తనని పలకరించలేదు. లేచిపోదామా అనుకుంటూ ఉండగా వాళ్ళే లేచారు.

"స్థానం వారి విప్రనారాయణకు వెడదాం" అని.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయినారు భగ్గుమంది అతని ఆగ్రహం.

రెండు నిమిషాల్లో ఆమె వెనక్కు వొచ్చి-

"రారేం?" అంది.

"ఎక్కడికి?"

"ఏం విచిత్రం?" వినటం లేదా మీరు."

"విన్నాను. కాని వొస్తాననలేదే."

ఈ లోపల బైటనించి అతను "కుసుమా" అని కేకలు వేస్తున్నాడు.

"అయితే రారా?"

"రాను."

"ఏం చేస్తారు వొంటరిగా, రద్దురూ?"

"నేను రాను..."

'కుసుమా' అని కేక.

"సరే మీ ఇష్టం" అని వెళ్ళిపోయింది.

అంతే, పావుగంటలో తన బట్టలు సర్దుకుని రిక్షాలో రైలుస్టేషన్‌కి వెళ్ళాడు - వాళ్ళ సొంత వూరికి ప్రయాణం.

## 5

పెద్ద సౌధం, దీపాలు, కారు, నౌకర్లు, మంచి వంటలు - ఇవన్నీ వొక్కసారిగా వొదిలి, పల్లెటూరిలో పడిపోయిన ఇంటో ముసలి తండ్రి దగ్గర చేరాడు అతను. తడుముకున్నట్టు ఉందిగాని చాలా శాంతిగా వుంది. ఆమె మీద పెద్ద ప్రేమ అతనికి ఎప్పుడూ లేదు. అందుకని ఏమీ బాధపడలేదు. అతని వొంతు నాలుగెకరాల పొలం వుంది ఆ ఊళ్లో. దాని సంగతే మరిచిపోయినాడు. తన పొలమూ, తన తండ్రి పొలమూ సేద్యం ప్రారంభించాడు. ఇంటి దగ్గిర తన వితంతువు అక్క లక్షణంగా వొండి పెడుతోంది. కాలం హాయిగా గడిచిపోయింది.

అతని భార్యని తీసుకురావడానికి బంధువులు ప్రయత్నించారు గాని ఆమె రానంది. సినిమాలు, పత్రికలూ ఏమీ లేవు. ఆ పల్లెటూళ్లో క్రమంగా ఆ వూరి వాళ్ళందరూ అతన్ని తమరిలో ఒకరిగా తీసుకున్నారు. దంపుడు బియ్యం. అన్నం, కందిపప్పు, గేదె నెయ్యి, పెరుగూ - బాగా బలిశాడు అతను. అవసరమైనప్పుడు పొలంలో స్త్రీలకి ఏమీ తక్కువ లేదు. ఆ రోజుల శాంతి ఎన్నడూ ఎరగడు జీవితంలో అతను. ఇప్పుడు చాలా ధనవంతుడు. ఏ చింతలూ లేవు అతనికి. కాని ఎక్కడో శాంతి తక్కువ. బుద్ధి వున్నవాడు ఎవరైనా, నాలుగు ఎకరాల పొలం ఉంటే దాన్ని వొదిలి ఇంకో పని తలపెట్టడు. పట్టణపు బొమ్మల వెంట ఎన్నడూ తిరగడు అనుకున్నాడు.

సంవత్సరన్నర గడిచింది.

ఒక మధ్యాహ్నం ఆమె ఇదివరకు కన్న పెద్ద కారులో వొచ్చింది. అకస్మాత్తుగా ఆ పల్లెటూరికి, సరాసరి మద్రాలు నుంచి, పెట్రోలు రేషన్ రోజుల్లో. నడిచి, అతను పొలంలో వున్నాడు కుప్పలు నూర్పిస్తో, అక్కడికి వొచ్చింది. ఆమె వెంట పెద్ద గుంపు. అప్పటికి ఆమెని చాలా మరిచిపోయినాడు అతను.

"ఏమిటిది?"

"పదండి."

"ఎక్కడికి."

"ఎక్కడికి? మద్రాసు."

"ఏం సంగతీ?"

"సంగతీ లేదు ఏం లేదు. బైలుదేరండి."

"నేను రాను."

"వొస్తేనేగాని నేను పోను."

"వుండు, మళ్ళీ వొస్తాను. యీ దిబ్బమీద కూచో, నేను వొచ్చిందాకా?"

అని పొలంలోకి కూలీల దగ్గరికి వెళ్ళిపోయినాడు. అతను తిరిగి వొచ్చేప్పటికి సూర్యుడు అస్తమించాడు. మాఘమాసపు మధురమైన గాలి వీస్తోంది. వరిమోడుల మీద నించి ఆ మాసపు సాయంత్రాల అందం, అల్లరి చేసి నిద్రకి కన్ను మూసుకునే అందమైన పాపాయిల కాళ్ళకింద మాత్రమే చూడగలం. అతను చమటవొంటితో వొచ్చి కూచోగానే--

"ఏం బతుకు ఇది?" అంది.

"చుట్టూ చూడు."

ఎదురుగా శుక్రుడు ధగధగ మంటున్నాడు.

"సరే లెండి. ఆ ఇల్లు ఆ మనుషులు."

"సినిమావాళ్ళకన్న అన్యాయమా?"

"కాని మీరెట్లా వున్నారు ఇట్లా?"

"చాలా హాయిగా."

"మీరు రావాలి."

"ఎన్నటికీ రాను."

"నా మీద కోపం పోలేదా మీకు?"

"మళ్ళీ రాదలుచుకుంటే ఆలోచించాలి. కాని నాకెందుకు? కోపమూలేదు. ఏమీ లేదు."

"మీరు రానిది నేను పోను."

"వుండమంటినిగా!"

"నా పనులో?"

"వెళ్ళు!"

"వెళ్ళను. మీ ఇంటోనే వుంటాను."

"ఏం తింటావు? కందిపప్పు, తోటకూరా..."

"ఓ తింటాను."

"ఇంకేం? వుండు."

"ఎంతకాలం?"

"సూర్యనారాయణ రానంతకాలం."

"అదీ. అట్లారండి. అక్కడవుంది మీ కోపమంతా."

ఆమె వంక చూస్తున్నాడు. ఆమెకి అందం వొస్తోంది. పరిస్థితుల మహిమ నీతో చదువుకుని, నీచేత తన్నులు తిన్న కుంక - వాడు ఓ డాక్టరైతే ఆ కాసిని ఏళ్ళల్లో ఆ బాధ్యతా, ఆ జ్ఞానమూ! అతన్ని ఎంత మార్చేస్తాయి! అకస్మాత్తుగా ధనం వొస్తే ఆరు నెలల్లో మనిషికి ఘరానా షావుకారు బరువు వొస్తుంది. అందువల్లనే ధనానికీ, విద్యకీ, అధికారానికీ అంత విలువ ప్రపంచంలో. అవి వుండడమనేదే కాదు. అవి మనిషికి ఇచ్చే పాలిష్, నాగరికత వల్ల.

"వున్నాడా?"

"లేడు. అప్పుడే పోయినాడు."

"ఎందుకు పోయినాడో పాపం."

"పోలీసుల్ని పిలిపిస్తానని బెదిరిస్తే."

"ఎందుకు అంత ఘోరమైన పని చేశావు."

"తాగుడు ఎక్కువైతే...."

"ఓ నువ్వేం చేస్తున్నావు?"

"మీకు తెలీనట్టు."

"నా కెట్లా తెలుస్తుంది?"

"అదేమిటి! పత్రికలా?"

"మా వూరు ఏవీ రావు."

"బావుంది. మామూలు పనే. ఎక్కడా వూపిరాట్టం లేదు. సినిమా పుస్తకాలు తెచ్చాను. ఈ నెలవి కారులో వున్నాయి చూపిస్తాను."

"మరి ఇప్పుడు తీరుబడి ఎట్లా అయింది."

నవ్వింది.

"మూడు రోజుల్లో మద్రాసులో వుండకపోతే అరడజను డైరెక్టర్లు పరుగెత్తుకుని వొస్తారు ఈ వూరు. మిమ్మల్నీ నన్నూ కట్టిపడేసి తీసుకుపోతారు."

"నన్నెందుకు?"

"మీరు లేంది నేను రానంటే."

"సరేలే, ముందు పద. రాత్రికి భోజనం చెప్పి చేయించాలి నీకోసం."

అని మాట్లాడుకుంటో పొలాల్లో నుంచి నడిచి ఒచ్చారు. ఎత్తు మడమల చెప్పులతో ఆమె మెరక పల్లాలల్లో జారుతూ వుంటే అతను ఆమెని పట్టుకుంటో, వాళ్ళ వెనక గుంపు.

భోజనం ఆమెకి వేరే వొడ్డించారు కులభేదం ప్రకారం. కాని పడకలకి కులభేదం పాటించరు, ఎంత శ్రోత్రియులూ, దృష్టిదోషం లేదు, ఎంగిలి దోషం లేదు, ఏ శాస్త్రంలోనూ, ఆ విషయంలో.

రాత్రి నిద్రలో అతను ఏ నందనవనాల్లోనో తేలిపోతున్నాడు. గొప్ప సెంటు సౌరభాల్లో పదిమంది అప్సరసలు అతన్ని కావిలించుకుని, ఒక్కసారిగా పదిమందీ అతన్ని మానభంగం చెయ్యాలని ఆత్రుతపడుతున్నారు. సగం తెలివి వొచ్చి, పది దేవతా పాత్రలు ధరించిన ఆమె, ఈ లోకం వాస్తవంలో కల్పిస్తున్న ఇంద్రజాలమని సగం తెలుసుకుని, ఆ అమృతానుభవం ఎక్కడ ఈ లోకంమల్లే సాధారణ మౌతుందోనని ఆ లోకంలోకి వెళ్ళిపోయినాడు.

ఆ రాత్రే నిశ్చయమయింది అతనికి, ఆమెతో వెళ్ళక ఎట్లానూ తప్పదని.

తెల్లారకట్ట, కిటికీ పక్కన విచ్చిన పారిజాతపు సువాసనల్లో కోయిల అరుపుల్లో. కిటికీలోకి తొంగిచూసే చందమామ వెలుగులో, ఆమె అతని రొమ్ము మీద నించి తలని తప్పించుకుని, మర్యాదగా తన పక్కమీదికి వెళ్ళిపోయింది.

ఆవూళ్ళో పొద్దున్న కాఫీ లేదు. ఆమెకి తలనొప్పి - పొరుగూరికి మనిషిని పంపారు. కాఫీ పొడరు కోసం. ఆమె మద్రాసు పోదామని పోరు.

రాత్రి ఆమె పెదవుల మధ్య ముద్దుమాటలు రహస్యాలూ పలికిన, అతని నిరాకరణలో నిన్న సాయంత్రపు బలమేదీ?

"నా రాణీ, నా కోయిలా, నా లిల్లీ పుష్పం" అని అతనూ.

"నా రాజా, నా దున్నపోతూ, నా ముళ్ళకంపా" అని ఆమె.

అంటో అర్ధరాత్రి డ్యూయెట్ పాడుకున్న తరవాత, తెల్లారి ఎట్లా కఠినంగా మొహం తిప్పుకోగలడు? అతనేం విశ్వామిత్రుడా, దుష్యంతుడా?"

కాని రాత్రి అమరత్వంలోంచి, స్వప్న లోకంనించి వాస్తవంలోకి కళ్ళు తెరిచారు. స్వప్నంలోంచి వాస్తవంలోకా, వాస్తవంలోంచి స్వప్నంలోకా. లేక సుందర స్వప్నంలోంచి నిస్సార స్వప్నంలోకా! అది మహాబుుషులు తేల్చవలసిన విషయం.

మొత్తానికి వాళ్ళ మామూలు దుష్ట ప్రపంచంలో, పాత జ్ఞాపకాల రోషాలూ, ముందు జీవితం మీద భయాలూ అలుముకున్నాయి అతని మనసుని.

"నేను వొచ్చి ఏం చెయ్యను? మళ్ళీ ఉద్యోగం ఇప్పిస్తావా?"

"కాదు, మీరు పత్రికలు చదవకపోవడం అనర్థమిచ్చింది. నేనే ప్రొడ్యూసర్ కాబోతున్నాను."

"ఐతే?"

"మీరు డైరెక్టరు నా చిత్రానికి."

"నేనా? నాకేం చాతనవుతుంది?"

"అదేమిటి? అన్ని చిత్రాలు అంత విజయవంతంగా తీసి ఈ నాడిట్ల అంటున్నారేమిటి?"

"సరేలే. నిజం మాట్లాడు."

"నిజమే. ఇప్పుడు చిత్రాలు తీస్తున్న డైరక్టర్లకి ఏం చాతనవును? మీకంత మాత్రం చాతకాకపోతుందా?"

"ఎందుకు నన్ను తీసుకుపోయి నువ్వు పైకి నెట్టడం? ఏమీ ఉపయోగం, అర్హతా, అవసరం లేకుండా నేను వొచ్చి తక్కిన వేషాలమల్లేనే ఓ డైరెక్టరు వేషం వెయ్యడం? నువ్విచ్చిన ఉద్యోగం నీ దయమీద ఆధారపడ్డం? మళ్ళీ నేనా ఇరుకులో పడ తలుచుకో లేదు."

"కానీ, నా సంగతేమిటి?"

"నీ సంగతేమిటి?"

"మీకు తెలీదా? మీరు నన్ను వొదిలి వెళ్ళిన చోటనే ఉన్నానన్న మాట. కొత్త పార్టు నాకు అర్థం కావటం లేదన్నమాట. మీ అవసరం తెలిసిందా?"

"అందువల్లనా ఈ ప్రేమ నటన నా మీద?"

ఆమె కన్నీళ్ళు పెట్టుకొని లేచిపోయింది. అతను వెంటపడి,

"నే నన్నదాంట్లో తప్పేముంది?" అని అడిగాడు.

ఈ విషయాలు వుత్త వాదనతో అర్థమయ్యేవి కావు. నాకు మీకైనా అవసరం ఎట్లాంటిదో గుర్తించకపోతే నేనింక ఏం చెప్పి మిమ్మల్ని నమ్మించగలను? నా అవసరాన్ని బట్టి మీ మీద ప్రేమ చూపుతున్నానంటే నేనేం జవాబు చెప్పగలను? మీ హృదయానికి నిజం తెలియాలిగాని!"

ఆ సంగతి లోపల ఎక్కడో అతనికీ తెలుసు.

"మరి మళ్ళీ సూర్యనారాయణ తటస్థించడని నమ్మకమేమిటి?"

"సూర్యనారాయణ ఒక్కడే గనక."

"ఈ లోకంలో అట్లాంటి వాళ్ళకి తక్కువేముంది!"

"లేదు. కాని నాకు జీవితంలో చిన్నప్పుడు నాకు తాళి కట్టిన మొగుడు ఒక్కడే గనక. అతనే సూర్యనారాయణ."

ఆగిపోయినాడు అతను.

"పాతివ్రత్యమనండి. దుష్టుడే! తోసుకువొచ్చాడు. మీచేత తన్నించడం తప్ప గత్యంతరం లేదు. అతన్ని వొదుల్చుకోవాలంటే, భర్త అనే పదం మీద గౌరవమనండి, పాతివ్రత్య మనండి. స్కాండల్ అంటే భయమనండి. ఏం చెయ్యలేక పోయినాను. మీ మీద కూడా కొంత కోపమేననుకోండి. అంత మాత్రం కొంచెం వొపికా, నా మీద నమ్మకం మీకెందుకు లేకపోవాలని! మీరు అతన్ని తంతే నా రహస్యం బైటపడుతుందనీ."

"నాతో రహస్యం చెప్పేసి వుండకూడదూ?"

"ఆహా! ఏం నంగనాచిలాగు మాట్లాడతారండీ! చెపితే మా ఇద్దర్ని ఆశీర్వదించి రైలెక్కరూ?"

పూర్తిగా లొంగిపోయినాడు అతను.

మర్నాడు ఆమెతో కారెక్కాడు.

తండ్రీ అక్క ఒక్క మాటనలేదు. అక్కడే ప్రేమగల బంధువుల ఆధిక్యం. ఏ కష్ట సమయంలోనైనా వాళ్ళ అండను చేరవొచ్చు. మళ్ళీ ఏ ప్రశ్నా లేకుండా వాళ్ళని వొదిలి పోవొచ్చు. అందుకనే తల్లిదండ్రుల ప్రేమకి అంత ఆధిక్యం ఇస్తారు.

తక్కిన కథ మీ అందరికీ బాగా విదితం. మమ్మల్ని మర్యాద చెయ్యవలసిన అవస్థ పట్టింది పాపం మీకు. మీ ఇళ్ళకు మమ్మల్ని పిలవాలి మీరు. పిలిచినా పిలవకపోయినా మా ఇంటికి రావడం తప్పలేదు మీకు. మా ఇంటికి వొచ్చి మీరు మమ్మల్ని గురించి ఏం మాట్లాడుకుంటారో తెలుసు మాకు. ఎట్లా తలుసునంటే, మావంటి వొదులు దంపతుల్ని మీరేం మాట్లాడుతో వుంటారో వింటోనే వున్నాంగా? పెళ్ళి అయిందంటే ఇంక వాళ్ళ సంగతి మాట్లాడటానికి ఏమీ వుండదు. వాళ్ళు ఏ బూతు ప్రమేయమూ లేకుండా ఏదో పవిత్రంగా ధర్మ సంస్థాపనలో లోక సంగ్రహం చేసుకుంటూ వుంటారు.

ఆ పనినే ఏదో చాలా లంపటంగా నీచంగా, పసువులమల్లే చేస్తారు పెళ్ళికాని వాళ్ళు. మమ్మల్ని వెక్కిరించుకునే సంతోషం మీనించి తీసివెయ్యడం మాకు ఏమీ సంతోషంగా లేదనుకోండి. ఎదటవున్న వాళ్ళల్లో చాలామంది ఒకే మనిషితో ఒకే పక్కమీద నిద్రపోవటం లేదన్న సంగతి ఈ పవిత్ర వివాహ సమయంలో మనం ఎవరం దాచుకోనక్కర్లేదు.

ఇంతకీ బిల్లు ప్రకారం, నా భార్య నాతో కాపరం నిరాకరించింది. కనక, విడాకులివ్వవొచ్చు. కాని సూర్యనారాయణకే అట్లాంటి నోటీసు పెడితే ఒక్క గంతున

దూకుతాడు ఆమె వొళ్ళో. అందుకని అతన్ని ఇంకో పద్దుకిందికి తీసుకొచ్చారు. అతన్ని మా ఇంటికి మిత్రుడి కింద ఆహ్వానించాం. అతనికి అడక్కుండానే చెక్కులు ఇచ్చాము అతి ప్రేమతో. పర్యవసానం? మితిమీరిన తాగుడు. ఆ మూలంగా అతనికి విడాకులివ్వడం చాలా సులభమయింది. ఆ మహానుభావుడు కోర్టులో పలికిన బూతులు పత్రికాధిపతులు పూర్తిగా సూచించారు.

ఎందుకు చెప్పాను ఈ కథ?

మీలో అనేకమందికి దీంట్లో ఏదో ఏ భాగమన్నా మార్గదర్శకంగా వుండకపోతుందా అని.

ఇంత క్షమతో మీరు నా కథ విన్నందుకు వందనాలు.

ఈ కథనించి నేనో విషయం తెలుసుకున్నాను. ఆ ఒక్క నిమిషం వోపిక పట్టండి. మీకోసం పక్క దగ్గరలో ఐస్‌క్రీం, ఫలహారాలు తయారుగా వుంచుతున్నారు. ఆ సంతోషంలో ఇది వినండి. వెళ్ళిపోవచ్చు. నేను చిత్రాలకి విజయవంతుడైన దర్శకుణ్ణి ఐనానంటే, లోకంలో ఏ మనిషైనా దర్శకుడు కావొచ్చునని వేరుగా రూఢిచెయ్యనక్కర్లేదు. కాని ప్రతిమనిషీ కాలేడు. ఎందుకంటే నాకూ, చాలామంది తక్కిన వాళ్ళకీ ఒక్క భేదముంది. అది నన్ను ప్రేమించే స్త్రీ నాకిచ్చిన ఆత్మబలం, విశ్వాసం! ప్రేమగల స్త్రీలు ఈ కాలంలో పురుషుడిలో వుండే లోపాల్ని జాగ్రత్తగా వెతికి, అతను ఎందుకూ అసమర్థుడనీ, ఒకవేళ అతను ఏ ఉద్యోగంలోనో, కళలోనో కొంత ఆధిక్యాన్ని సంపాయిస్తే, అది ప్రజల మూర్ఖత్వం వల్లనో, అతను చేస్తున్న మోసం వల్లనో తటస్థించిందని వాదించి, తమ భర్తల ధైర్యస్థైర్యాన్ని గుంజి, చంపడంలో తమ ప్రేమాధిక్యాన్ని నిరూపణ చేసుకుంటున్నారు. కానీ ఏ అదృష్టం వల్లనో, ఈ కుసుమ నాలో విశ్వాసాన్ని ప్రతిష్ఠించి, నన్ను రగిల్చి, సాధారణమైన మానవుణ్ణి ఒక ప్రతిభావంతుణ్ణి చేసింది అదీ భేదం.

ఇక మనం లేవవచ్చు.

◆ ◆ ◆

*ప్రచురణ : (చలంకథలు - 1వ సంపుటం) దేశి కవితామండలి, 1956*